


ఆర్కే బీచ్‌రోడ్డులో ప్రధాన వేదిక నిర్మాణం

యోగాకు ముమ్మర ఏర్పాట్లు

బీచ్‌రోడ్డు పొడవునా పచ్చటి మ్యాట్లు

ఇరువైపులా బారికేడ్లు

- ఎక్కడికక్కడ ఫ్లడ్ లైట్లు, భారీ స్ర్కీన్లు
- ఆర్కే బీచ్‌రోడ్డులో ప్రధాన వేదిక నిర్మాణం
- కీలక ప్రాంతాల్లో ఎస్పీజీ తనిఖీలు
- ఏయూలో ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటు
- ప్రధాన కూడళ్ల వద్ద విద్యుద్దీపాలంకరణ




నగరంలోని సిరిపురం జంక్షన్‌లో విద్యుద్దీపాల అలంకరణ

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): **అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 21వ తేదీ ఉదయం బీచ్‌రోడ్డులో నిర్వహించనున్న కార్యక్రమానికి సుమారు ఐదు లక్షల మందిని సమీకరించాలని భావిస్తోంది. ఈ మేరకు మంత్రులు, ఉన్నతాధికారులు నగరంలోనే మకాం వేసి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. మరోవైపు బీచ్‌రోడ్డులో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటికే పచ్చటి మ్యాట్లు వేయడం ప్రారంభించారు. కొన్నిచోట్ల ఇరువైపులా, మరికొన్నిచోట్ల ఒక వైపు మ్యాట్లు వేశారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ బీచ్‌రోడ్డు పొడవునా 268 కంపార్టుమెంట్లు ఏర్పాటుచేస్తున్నారు. ప్రతి కంపార్టుమెంటులో ఒక వేదిక నిర్మించారు. కంపార్టుమెంటులో ఉండే వారితో వేదికపైనుండే శిక్షకుడు యోగాసనాలు వేయిస్తారు.**

ప్రధాన వేదికను ఆర్కే బీచ్‌రోడ్డులో కాళీమాత ఆలయ సమీపంలో ఏర్పాటుచేస్తున్నారు. వర్షం వచ్చినా యోగా ప్రదర్శనకు అంతరాయం లేకుండా వాటర్ ప్రూఫ్ టెంట్లు వేశారు. ఫ్లడ్ లైట్లు, భారీ స్ర్కీన్లు ... మిగతా 6వ పేజీలో

కలెక్టరేట్ ప్రాంగణంలో సీఎం బస

- టీడీపీ కార్యాలయంలో లోకేశ్...



విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ఈనెల 20వ తేదీన నగరానికి రానున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కలెక్టరేట్ ఆవరణలో బస్సులో బస చేయనున్నారు. ఐటీ మంత్రి నారా లోకేశ్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బసచేస్తారు. హుద్‌హుద్ తుఫాన్ అనంతరం నగరానికి వచ్చినప్పుడు చంద్రబాబునాయుడు వారం రోజులపాటు కలెక్టరేట్ ప్రాంగణంలో బస్సులోనే ఉన్నారు.

20, 21 తేదీల్లో పాఠశాలలకు సెలవు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు కాంపిన్సేటరీ సెలవులు ప్రకటించామని విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. అయితే 20, 21 తేదీల్లో ఉదయం పూట పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్లు యోగా కార్యకలాపాలు నిర్వహించి 'లీప్' యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.



ఇసుకతోట నుంచి హనుమంతవాక మధ్య జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

హైవేపై ట్రాఫిక్ జామ్

కొమ్మాది జంక్షన్ నుంచి మద్దిలపాలెం రావడానికి గంటన్నర సమయం

- ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ అదే పరిస్థితి
- బీచ్ రోడ్డులో రాకపోకల నిలిపివేత ఫలితం
- ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు ఎక్కడ?
- డ్రోన్లు ఉపయోగించాలని మంత్రి అనిత ఆదేశం
- ఇప్పుడే ఇలా ఉంటే శుక్ర, శనివారాల్లో పరిస్థితి ఏమిటో..?
- నగర ప్రజల ఆందోళన



హనుమంతవాక జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జాతీయ రహదారిపై బుధవారం ట్రాఫిక్ జామ్ అయ్యింది. బీచ్ రోడ్డులో ఈ నెల 21న 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నందున ఎటువంటి వాహనాలు రాకుండా పోలీసులు కట్టడి చేశారు. ఎక్కడికక్కడ మార్గాలు మూసేశారు. దాంతో బీచ్ రోడ్డులో వెళ్లాల్సిన వాహనాలన్నీ జాతీయ రహదారిపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు మొదలయ్యాయి. బుధవారం అటు కొమ్మాది నుంచి మద్దిలపాలెం రావడానికి వాహన చోదకులకు రెండు గంటల ... మిగతా 6వ పేజీలో

విశాఖ విమల విద్యాలయాల మూత

తరగతులు నిర్వహించలేమని ప్రకటన

- ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో నిధులు సమకూర్చలేమన్న స్టీల్ ప్లాంటు యాజమాన్యం
- అయోమయంలో 1,970 మంది విద్యార్థులు



(విశాఖపట్నం/ఉక్కు టౌన్‌షిప్-ఆంధ్రజ్యోతి) **స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో వారిచ్చే నిధులతో నడుస్తున్న విశాఖ విమల విద్యాలయాలు మూతపడ్డాయి. ఈ విద్యా సంవత్సరం 2025-26 నుంచి తరగతులు నిర్వహించలేమని చేతులెత్తేశాయి. పాఠశాలల పునఃప్రారంభమైన తరువాత ఈ విషయం చెప్పడంతో అక్కడ చదువుకుంటున్న 1,970 మంది విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.**

స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఇచ్చే నిధులతో ఉక్కు నగరంలో ఒకటి, బాలచెరువు రోడ్డులో మరొకటి విశాఖ విమల విద్యాలయ సంస్థలు నడుస్తున్నాయి. తొలుత ఉద్యోగుల పిల్లలకు మాత్రమే ఉచిత విద్య అందించేవారు. 2014 నాటికి ఉక్కు నిర్వాసిత కాలనీల్లో పిల్లలను కూడా చేర్చుకున్నారు. వారికీ ఉచిత విద్య అందించారు. ఆ తరువాత 2019లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడంతో నామమాత్రంగా ఫీజు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఈ విద్యా సంస్థల్లో వార్షికంగా గరిష్ఠ ఫీజు రూ. 12 వేలు. శాశ్వత ఉపాధ్యాయులు 47 మంది, కాంట్రాక్టు సిబ్బంది 30 మంది పనిచేస్తున్నారు. వీటి నిర్వహణకు వార్షిక బడ్జెట్ రూ.7.5 కోట్లు. విద్యార్థుల నుంచి ఫీజుల రూపేణా ఏడాదికి రూ.2.5 కోట్లు వస్తున్నాయి. మిగిలిన రూ.5 కోట్లు స్టీల్ ప్లాంటు యాజమాన్యం సమకూర్చేది. అయితే స్టీల్ ప్లాంటు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో అందులో పనిచేసే ఉద్యోగులకే జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. దాంతో ఈ విద్యా సంస్థలకు ఆర్థిక సాయం చేయలేమని గత కొంతకాలంగా చెబుతూ వస్తోంది. ఫీజులు పెంచుకొని సొంతంగా నిర్వహించుకోవాలని సూచించింది. అయితే ఈ విద్యా సంస్థలను నడుపుతున్న మిషనరీ సంస్థ ఆ దిశగా ... మిగతా 6వ పేజీలో

కేంద్ర కారాగారం నుంచి క్షమాభిక్షపై ముగ్గురు ఖైదీలు విడుదల



విశాఖ కేంద్ర కారాగారం నుంచి విడుదలై వస్తున్న ఖైదీలు

ఆరిలోవ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారం నుంచి క్షమాభిక్షపై బుధవారం రాత్రి ముగ్గురు ఖైదీలను విడుదల చేసినట్టు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. వీరిలో విజయవాడకు చెందిన కె.ప్రసాద్, విజయనగరం జిల్లా వంగర మండలం తులగాం గ్రామానికి చెందిన అరసార కృపారావు, అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన కోటేశ్వరరావు ఉన్నారు. ఈ ముగ్గురూ హత్యా నేరాలపై శిక్షపడినవారు. ప్రసాద్, కృపారావులు 14 ఏళ్ల, కోటేశ్వరరావు ఆరేళ్ల జైలు శిక్ష అనుభవించారు. వ్యవసాయం, వ్యాపారాలు చేసుకుని బతుకుతామని వారు తెలిపినట్టు జైలు సూపరింటెండెంట్ చెప్పారు.

ఉక్కులో దిద్దుబాటు



తొమ్మిది మంది ఉన్నతస్థాయి అధికారులతో కమిటీ

- పూర్తి స్థాయి ఉత్పత్తికి యాజమాన్యం దూకుడుగా వెళుతుందన్న ఆరోపణల నేపథ్యంలో స్టీల్ మంత్రిత్వశాఖ నిర్ణయం
- వివిధ విభాగాల్లో 30 ప్రాజెక్టుల సత్వర పూర్తికి ఆదేశం
- బడ్జెట్, కేటాయింపులు, ప్రాథమిక అనుమతులు, టెండర్ల తయారీ, ఖరారు వంటి విధుల నిర్వహణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) విశాఖపట్నం స్టీల్ ప్లాంటు యాజమాన్యం దూకుడుగా వెళుతోందని, వివిధ విభాగాల్లో అవసరమైన మరమ్మతులు చేయకుండా పూర్తి ఉత్పత్తికి సిద్ధమవుతున్నదని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఢిల్లీలోని స్టీల్ మంత్రిత్వశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ప్లాంటులో వివిధ విభాగాలకు చెందిన ఐదుగురు జనరల్ మేనేజర్లు, ముగ్గురు డీజీఎంలు, ఒక సీజీఎం...మొత్తం తొమ్మిది మందితో ఒక కమిటీని ఏర్పాటుచేసింది. వీరంతా కలిసి వీలైనంత త్వరగా ముఖ్యమైన 30 ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని బాధ్యతలు అప్పగించింది. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంటులో ఆరు ప్రాజెక్టులు, కోక్ ఓవెన్ అండ్ కోల్ కెమికల్ ప్లాంటులో తొమ్మిది ప్రాజెక్టులు, సింటర్ ప్లాంటులో ఎనిమిది, బ్లాస్ట్ ఫర్నేస్‌లో రెండు, ఎస్ఎంఎస్-1లో ఒకటి, ఎస్ఎంఎస్-2లో మరొకటి, రోలింగ్ మిల్, వైర్ రాడ్ మిల్స్‌లో మూడు ప్రాజెక్టులు తక్షణమే చేపట్టాలని ఆదేశించింది. వీటికి అవసరమైన బడ్జెట్, కేటాయింపులు, ప్రాథమిక అనుమతులు, క్లియరెన్స్‌లు, అంచనా వ్యయాల రూపకల్పన, టెండర్ల తయారీ, ఖరారు, గడువులోగా పూర్తి వంటి విధులన్నీ ఈ కమిటీ నిర్వహించాలని ఆదేశించింది.

ప్రమాదాల నివారణ ధ్యేయంతోనే...

ప్లాంటు చాలాకాలంగా పూర్తి సామర్థ్యంతో పనిచేయడం లేదు. 60 శాతమే ఉత్పత్తి జరుగుతోంది. దాంతో కొన్ని విభాగాలు కొద్దికాలంగా రన్నింగ్‌లో లేవు. ఈ నెల 26వ తేదీ నుంచి బ్లాస్ట్ ఫర్నేస్-3ని ప్రారంభించి 100 శాతం ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఆయా విభాగాలకు మరమ్మతులు, నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉంది. కాంట్రాక్టు వర్కర్లను వేల సంఖ్యలో తొలగించడంతో ఆయా పనులు చేసే వారు కరవయ్యారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మరమ్మతులు చేపట్టకుండా పూర్తి ఉత్పత్తికి వెళితే కచ్చితంగా పెద్ద ప్రమాదాలు జరుగుతాయని ఉద్యోగ, కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయితే యాజమాన్యం ఇవేమీ తనకు సంబంధం లేదన్నట్టుగా మొండిగా వ్యవహరిస్తోంది. ఈ విషయాలు ప్రజా ప్రతినిధుల ద్వారా ఢిల్లీ పెద్దలకు చెప్పడంతో ఉక్కు మంత్రిత్వ శాఖ నివేదికలు తెప్పించుకుంది. అనేక విభాగాల్లో నిర్వహణ పనులు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తించి, వాటిని తక్షణమే చేపట్టాలని ఆదేశించింది. ఈ వ్యవహారాలన్నీ సజావుగా, వీలైనంత ... మిగతా 6వ పేజీలో

ఏకోపాధ్యాయులకు నిరాశ

బదిలీ అయినా రిలీవ్ కాలేని పరిస్థితి



చోడవరం మండలం కోమటివీధిలో ఏకోపాధ్యాయ పాఠశాల

- ఆయా పాఠశాలలకు ఎవరినీ నియమించకపోవడమే కారణం
- డీఎస్సీ నియామకాలు పూర్తయ్యేంత వరకూ ఆగాలని విద్యా శాఖ అధికారుల ఆదేశం
- ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 మందిపై ప్రభావం
- అన్ని కేడర్లు కలిపి 4,903 మంది బదిలీ
- 153 మంది టీచర్లకు పదోన్నతి

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): **ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో బదిలీ అయిన ఏకోపాధ్యాయులకు విచిత్రమైన సమస్య ఎదురైంది. జిల్లాలో కేటగిరీ-3,4 పాఠశాలల్లో (మారుమూల ప్రాంతాల్లో ఉన్న స్కూళ్లు) ఏకోపాధ్యాయులుగా పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన వారు రిలీవ్ కాలేని పరిస్థితి నెలకొంది. తాజా బదిలీల్లో ఏకోపాధ్యాయులు పనిచేసే పాఠశాలలకు మిగిలిన టీచర్లు ఆప్షన్స్ ఇవ్వకపోవడంతో ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం నిర్వహిస్తున్న డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టిన తరువాత ఏకోపాధ్యాయ పాఠశాలలకు టీచర్లను పంపుతామని, అప్పటివరకూ బదిలీ అయిన ఉపాధ్యాయులు అదే పాఠశాలల్లో పనిచేయాలని విద్యా శాఖ స్పష్టంచేసింది.**

ఉమ్మడి జిల్లాలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మారుమూల ప్రాంతాలు అంటే ప్రధాన రోడ్లకు 20 నుంచి 40 కి.మీ. దూరంలో ఉన్న పాఠశాలలను కేటగిరీ 3, 4గా పరిగణిస్తారు. ఉమ్మడి జిల్లాలో 250 నుంచి 300 వరకూ ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. బదిలీల సమయంలో అక్కడ పనిచేసే టీచర్లకు ఎక్కువగా ప్రాధాన్యం ఉంటుంది. దీంతో మైదానం, నగరం, ప్రధాన కూడళ్లకు సమీపంలోని పాఠశాలలకు వచ్చేశారు. అదే సమయంలో నగరం, మైదానంలో టీచర్లు మారుమూల ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. అయితే ఎస్జీటీల కొరత ఉండడంతో బదిలీలు తప్పనిసరి అయిన వారిలో చాలామంది నగరం నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని స్కూళ్లకు వెళ్లారు. మారుమూల ప్రాంతాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలకు వెళ్లడానికి ఎవరూ ఇష్టపడలేదు. దీంతో బదిలీ అయిన ఉపాధ్యాయుల నుంచి బాధ్యతలు తీసుకునేవారు లేకపోవడంతో సమస్య ఉత్పన్నమైంది. ఈ విషయమై పలువురు టీచర్ల నుంచి విద్యా శాఖపై ఒత్తిడి రావడంతో సమస్యను ఉన్నతాధికారులకు నివేదించారు. బదిలీ అయిన ఏకోపాధ్యాయులంతా కొత్తగా పోస్టింగ్ వచ్చిన పాఠశాలల్లో రిపోర్టు చేసి, తిరిగి ఏకోపాధ్యాయ పాఠశాలకు వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. త్వరలో డీఎస్సీ నియామకాలు చేపడతామని, కొత్తగా రానున్న టీచర్లను ... మిగతా 6వ పేజీలో

ఎన్‌కౌంటర్‌తో కలకలం

అల్లూరి జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో మృతిచెందిన అరుణ

- తల్లిదండ్రులు కరకవానిపాలెంలో నివాసం
- ఉలిక్కిపడ్డ పెందుర్తి
- మహిళా మావోయిస్ట్ అరుణ ఎన్‌కౌంటర్



అరుణ (పాత చిత్రం)

పెందుర్తి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కింటుకూరు అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు అరుణ మృతి స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆమె తల్లిదండ్రులు లక్ష్మణరావు, అర్జునమ్మ పెందుర్తి మండలం గొరపల్లి పంచాయతీ పరిధి కరకవానిపాలెంలో నివాసం ఉంటున్నారు. లక్ష్మణరావు ఇరవై ఏళ్ల క్రితం భార్య, ముగ్గురు పిల్లలతో కరకవానిపాలెం వచ్చారు. ఆయన ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఆయనకు స్థానికంగా మంచి పేరుంది. లక్ష్మణరావు, అర్జునమ్మ దంపతుల పెద్ద కుమార్తె అరుణ. ఇరవై ఏళ్ల వయసులో ఆమె ఉద్యమంలోకి వెళ్లినట్టు చెబుతున్నారు. అరుణ భర్త చలపతి ఒడిశా రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా పనిచేస్తూ ఈ ఏడాది జనవరి నెలలో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఇప్పుడు అరుణ చనిపోయారు. ఆమె తలపై రూ.20 లక్షల రివార్డు ఉంది. కుమారుడు గోపి అలియాస్ ... మిగతా 6వ పేజీలో



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

ఘనంగా కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

విశాలాక్షినగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 9వ వార్డులోని విశాలాక్షినగర్ మెయిన్ రోడ్డులో ఉన్న విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి విశిష్ట పూజలు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం పల్లకిసేవ, శివకల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

'విశాఖపై కార్పొరేట్ సంస్థల చిన్నచూపు'

భీమునిపట్నం (రూరల్), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరంపై కార్పొరేట్ సంస్థలు చిన్నచూపు చూస్తున్నాయని గ్రామాభ్యుదయ సమితి కన్వీనర్ సినగం రామారావు విమర్శించారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆనందపురం మండలం తర్లువాడ వద్ద గూగుల్ సంస్థ తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తొలుత ప్రకటించి, ఇప్పుడు అమరావతికి తరలించినట్టు ప్రకటన చేయడం దారుణమన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత భీమిలి, ఆనందపురం మండలాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని, యువతకు ఉద్యోగాలు వస్తాయని ఆశించామనికానీ అందుకు భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు.

విద్యార్థి కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సాగర్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, వాడపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం కిట్లు పంపిణీ చేశారు. 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జనసేన నాయకుడు శాఖరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు అక్కరబోయిన రాంబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, బీజేపీ వార్డు అధ్యక్షుడు గరికిన ఎల్లాజి, ధనరాజ్, ఎరుపల్లి లక్ష్మణ, బీజేపీ నాయకుడు నాగరాజు, అచ్చుతరావు చేతుల మీదుగా వీటిని అందజేశారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు సింహాచలనగర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం గేదెల సన్యాసిరావు బుధవారం విద్యార్థి కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ డి. శివకృష్ణ, వైస్ చైర్మన్ పి. భవానీ, ఉపాధ్యాయులు ఎన్. సలోమీ, ఎం. ఝాన్సీలక్ష్మీబాయ్, కె. రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న శ్రీను

భీమునిపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని వైసీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) అన్నారు. బుధవారం గొల్లలపాలెంలో జరిగిన 3వ వార్డు కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకూ క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారో, ఎన్ని అవమానాలు చవిచూసారో తెలుసుకున్నానని, ఇకపై అటువంటి పరిస్థితి లేకుండా అందరికీ అండగా ఉంటానని చెప్పారు. వైసీపీ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నరసింగరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఎస్. కరుణాకర్‌రెడ్డి,కోండ్రు రామసూరప్పడు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కదిరి ఎల్లాజి, గుండాసు మధునాయుడు, వాసుపల్లి కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

» మంత్రి నారాయణ
» అధికారులు, కూటమి నాయకులతో సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర మునిసిపల్ శాఖా మంత్రి పి. నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన బీచ్ రోడ్‌లో వున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గం లోని అధికారులు, కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోదీకి విశాఖపై ఉన్న విశ్వాసంతో ముఖ్యమంత్రి చంద్రబాబు యోగాంధ్రను విజయవంతం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆయన విశ్వాసానికి అనుగుణం గా ప్రజలు, నాయకులు, అధికారులు శ్రమించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గానికి 840 బస్సులను కేటాయించారని, ప్రతి బస్సులోనూ ఇద్దరు అధికారులు వుంటారని, వారితో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల్లో ఎవరైనా ఇద్దరు ఉండాలన్నారు. అధికారులు, నాయకులు సమన్వయంతో ప్రజలను వారికి కేటాయించిన కంపార్టుమెంట్‌లకు చేర్చాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీ ఎం. శ్రీభరత్, పరిశీలకుడు జీవీ ఆంజనేయులు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి శ్రీధర్, శ్రీబీద రవీంద్ర, దామచర్ల సత్య, జనసేన నియోజవర్గ కన్వీనరు పంచకర్ల సందీప్, నాయకులు గంటా నూకరాజు, గాడు వెంకటప్పడు, డి.ఎ.యన్. రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాక్‌థాన్

విశాఖపట్నం : యోగాంధ్ర సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం ఆరు గంటలకు ఏయూ కన్వెన్షన్ హాలు నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకు వాక్‌థాన్ నిర్వ హించనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వాక్‌థాన్ అనంతరం అధికారులు, శిక్షకులు, ప్రజలు యోగాసనాలు వేస్తారని చెప్పారు.

కొమ్మాదిలో...

కొమ్మాది : యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. సురేశ్ అన్నారు. బుధవారం ఆ కళాశాల ఆవరణలో ఏయూ యోగా విలేజ్ శిక్షకురాలు ఎం.కావ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా వల్ల కలిగే ఉపయోగాలను తెలియజేశారు. అనంతరం గంట పాటు యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో కళాశాల పిడి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా యోగాంధ్రలో భాగంగా మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజల కోసం సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాల మైదానం, క్రికెట్ స్టేడియం బి. గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్, శ్రీకాకుళం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయదేవి పరిశీలించారు. వారితో పాటు సోంపేట, సరుబుజ్జిలి, వజ్రపుకొత్తూరు తహసీల్దార్లు అప్పలస్వామి, మధుసూదన్, సీతారామయ్య ఉన్నారు.

పద్మనాభం : నగరంలో ఈనెల 21న జరిగే యోగాంధ్రలో ప్రజలు అధికంగా పాల్గొనేలా యోగా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేష్‌కుమార్ చెప్పారు. మద్ది గ్రామంలో బుధవారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



స్వామివారి సన్నిధిలో ఎంపీ శ్రీభరత్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్

సింహాచలం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని విశాఖ ఎంపీ శ్రీభరత్, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ బుధవారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఆలయాల్లో కనీస సౌకర్యాలు కరువు

భీమునిపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులకు కనీస సౌకర్యాలు ఉండడం లేదు. ముఖ్యంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం, కాత్యాయిని సహిత భీమేశ్వరాలయం, రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి, జగన్నాథస్వామి దేవాలయం, బాలా త్రిపుర సుందరి సహిత చంద్రశేఖర ఆలయం, నూకాలమ్మ ఆలయానికి భక్తులు నిత్యం అధిక సంఖ్యలో వస్తుంటారు.అలాగే కల్యాణ వేంకటేశ్వరస్వామి, ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయాలను కూడా భక్తులు అధికంగా దర్శిస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి టాయిలెట్లు లేక చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళల అవస్థలు వర్ణనాతీతం. జీవీఎంసీ, దేవాదాయ శాఖాధికారులు స్పందించి ఆలయాల వద్ద కనీస సౌకర్యాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గోతులమయంగా బీచ్ రోడ్డు

విశాలాక్షినగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డులో కొన్నిచోట్ల గోతులు ఉండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 9వ వార్డు పరిధిలోని విశాలాక్షినగర్ సీతకొండ మలుపు నుంచి అప్పుఘర్ వరకు అండర్ గ్రౌండ్ ఫైబర్ నెట్ నిర్వహణ, మరమ్మతుల్లో భాగంగా రహదారికి ఒకవైపు గోతులు తవ్వారు. పనులు పూర్తయిన తరువాత మట్టితో తూతుమంత్రంగా గోతులను పూడ్చారు. వర్షాలకు గోతుల్లో ఉన్న మట్టి కొట్టుకు పోవడంతో మళ్లీ యథాస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గోతుల పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉక్కులో దిద్దుబాటు

... 5వ పేజీ తరువాయి

వేగంగా పూర్తి చేయడానికి మెకానికల్, ఎలక్ట్రికల్, సేఫ్టీ ప్రాజెక్ట్ విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని వేసింది. వారిని సమన్వయం చేసే బాధ్యతలను వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్‌కు అప్పగించింది. కమిటీ నియామకంపై ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. తాము ఈ పనులు చేయాలనే మొత్తుకుంటున్నామని, ఎవరు చేసినా తమకు అభ్యంతరం లేదని, ప్రమాదాలకు ఆస్కారం లేని పని వాతావరణం కల్పించాలనేదే తమ డిమాండ్ అని పేర్కొన్నాయి.

గంభీరం పాఠశాలకు ల్యాప్‌టాప్ వితరణ

ఆనందపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ఎన్ఆర్ఐ దంపతులు దుర్గ మల్లికార్జునరావు, సావిత్రి ల్యాప్‌టాప్‌ను బుధవారం వితరణగా అందించారు. గ్రామపెద్దల విజ్ఞప్తి మేరకు వారు ఈ సహాయాన్ని అందించారని పాఠశాల హెచ్ఎం ప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లలిత, శివ గంగ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అనంతవరంలో 'వికసిత్ భారత్' సభ



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధి కూలీలు, బీజేపీ నాయకులు

పద్మనాభం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతవరం గ్రామంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనరు ఆర్. రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ప్రపంచంలోనే దేశ గౌరవ ప్రతిష్టను ఇనుమడింపజేశారని కొనియాడారు. అనంతరం 11 ఏళ్ల కేంద్రం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు టి. నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సోమేశ్వరరావు, వెంకటరావు, పేర్రాజు, కృష్ణ, కృష్ణమ్మ, ఎర్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నాయకులు

తగరపువలస, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సీఐటీయూ మధురవాడ జోన్ మహాసభలు తీర్మానించాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిట్టివలస జూట్‌మిల్లు కల్యాణ మండపంలో జరిగిన ఈ సమావేశాల్లో పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మూర్తి, జోన్ కార్యదర్శి ఆర్. నరసింగరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటులో తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలని, జూలై 9న జరిగే పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. భీమిలి మండల అధ్యక్షుడిగా నీలాతి రాము, ఉపాధ్యక్షుడిగా పల్ల పెంటరాజు, కార్యదర్శిగా గొరిసి శ్రీను, సహాయ కార్యదర్శిగా ఎం. ఈశ్వరరావు, కోశాధికారిగా సుకాసి వెంకట సత్యం ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు ఎస్. అప్పలనాయుడు, ముద్దాడ రాము, నాగరాజు పాల్గొన్నారు.

ఖరీఫ్ పనుల్లో రైతులు

ఎద్మనాభం రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈఏడాది ముందుగానే వర్షాలు పడడంతో పొలాలను దుక్కి దున్ని వరి నారుమళ్లకు సిద్ధం చేస్తున్నారు. చాలాగ్రామాల్లో రైతులు ఇప్పటికే దుక్కులు పూర్తి చేశారు. నారు వేయడానికి, ఎరువులు తెచ్చుకోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా మండలంలో సుమారు 18,250 హెక్టార్ల వ్యవసాయ భూమి ఉండగా, రైతులు 12 వేల హెక్టార్లలో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు.



మద్దిలో వరి నారు వేయడానికి సిద్ధం చేసిన పొలం

ప్రమాదకరంగా ఫుట్‌పాత్‌లు

మధురవాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 5, 6, 7 వార్డుల పరిధిలోని కొమ్మాది నుంచి పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు ప్రాణ సంకటంగా మారాయి. కొన్నిచోట్ల ఫుట్‌పాత్‌లపై పలకలు లేవు. మరికొన్నిచోట్ల రెండు పలకలు మధ్య ఖాళీలు ఉన్నాయి. ఏమాత్రం వర్షం పడినా ఫుట్‌పాత్‌లపై నీరు ప్రవహించి, అవి కనిపించడం లేదు. దీంతో వాటిపై నడిచి వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల దుర్గానగర్‌లో ఒక మహిళ ఫుట్‌పాత్‌పై నడిచి వెళుతుండగా రెండు పలకలు మధ్య ఉన్న ఖాళీలో కాలు ఇరుక్కుపోయింది. ఆమె బాధతో విలవిల్లాడింది. స్థానికులు చొరవ తీసుకొని మహిళ కాలును బయటకు తీసి సపర్యలు చేశారు. ప్రతిరోజూ ఇలా పలువురు ఫుట్‌పాత్‌ల వద్ద గాయపడుతున్నా.. జీవీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు దుర్గానగర్ సర్వీసు రోడ్డుపై గుంతలు పడ్డాయి. వీటివల్ల వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొంతమంది స్థానికులు సిమెంటు, పిక్క వేసి గుంతలను తాత్కాలికంగా పూడ్చారు. అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై పలకలు వేయించడంతో పాటు రహదారులపై గుంతలు పూడ్చాలని పలువురు కోరుతున్నారు.



పలకల మధ్య ఖాళీ (ఇన్‌సెట్లో) ఇటీవల గాయపడిన మహిళ

బంగారమ్మ పండగ ప్రారంభం



సింహాచలం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సహోదరి, అడివివరం తదితర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత బంగారమ్మ తల్లి వార్షిక పండగ బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలిరోజు శతకం పట్టు వద్ద అనువంశిక పూజారి వంశీయులు లండ వెంకటరమణ పర్యవేక్షణలో పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం సింహాచలం ప్రధాన వీధుల్లో జోగి తిరువీధి జరిపారు. రాత్రి అమ్మవారి ప్రధాన గరగను ప్రధాన పూజారి, మరికొన్ని గరగలను భక్తులు శిరస్సున దాల్చి ఊరేగించారు. ఈనెల 23 వరకు ఉత్స వాలు నిర్వహించి, 24న అమ్మవారి అనుపు ఉత్సవం జరుపుతామని దేవస్థానం అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో శాంతి భద్రతల విఘాతానికి జగన్ యత్నం

హోం మంత్రి వంగలపూడి అనిత

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతల విఘాతానికి వైసీపీ అధినేత జగన్ ప్రయత్నిస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. బీచ్ రోడ్డులో ఈ నెల 21న చేపట్టనున్న యోగాంధ్ర ఏర్పాట్లను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నేరస్థుడు రాజకీయ నాయకుడైతే ఎలా ఉంటుందో జగన్‌ను చూస్తే అర్థమవుతుందన్నారు. ఏడాదిలో జగన్ పరామర్శలకు వెళ్లడమే అజెండాగా చేసుకున్నారని ఎద్దేవా చేశారు. జగన్ పర్యటనల్లో రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. బెట్టింగ్‌ల్లో డబ్బు పోగొట్టుకుని నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుంటే దానిని పోలీసులపైకి నెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. గత ఏడాది జూన్‌లో నాగమల్లేశ్వరరావు మృతిచెందితే...ఇప్పుడు ఆ కుటుంబాన్ని పరామర్శించడం జగన్ శవ రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. తాజాగా బుధవారం జగన్ కాన్వాయ్ ఢీకొని వైసీపీ కార్యకర్త చనిపోతే కనీసం స్పందించలేదని, చివరికి పోలీసులు ఆస్పత్రికి తరలించారన్నారు.రాజకీయం ముసుగులో జగన్ కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. అంతర్జాతీయ యోగా వేడుకల నేపథ్యంలో రాష్ట్రంలో అలజడి సృష్టించాలని జగన్ చూస్తున్నారని విమర్శించారు. జగన్‌లాంటి వ్యక్తి సమాజంలో ఉండడానికి వీలు లేదన్నారు. సినిమా చూపిస్తాం.. తాట తీస్తామనడం వంటి దిగజారుడు మాటలు ఆ పార్టీ నేతల దివాళాకోరుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

సాగర్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బుధవారం ఆయన రుషికొండ ఏ-1 ఫంక్షన్‌లో హాల్‌లో బందోబస్తు, భద్రతా విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీ సెజ్ నుంచి కాపులుప్పాడ వరకు ఏర్పాటు చేసిన 59 కంపార్టుమెంట్లలో విస్తృత స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రముఖల భద్రత దృష్ట్యా కొత్తవలస మండలం చింతలపాలెం, డెంకాడ మండలం రాజుపులోవ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చెక్ పోస్టులు వద్ద నిరంతరం వాహన తనిఖీలు ఉంటాయన్నారు. సమావేశంలో ఏఆర్ ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి. నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

హైవేపై ట్రాఫిక్ జామ్

... 5వ పేజీ తరువాయి

సమయం పట్టింది. ముఖ్యంగా విశాఖ వేలీ స్కూల్ జంక్షన్ నుంచి మద్దిలపాలెం రావడానికి గంటన్నర పట్టింది. ఉదయం 10 గంటలకు మొదలైన ఈ సమస్య రాత్రి 10 గంటల వరకూ కొనసాగింది. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వారు చాలా ఇబ్బందిపడ్డారు. పోలీసులంతా బీచ్ రోడ్డుకే పరిమితం కావడం, ట్రాఫిక్ క్లియర్ చేయడానికి అదనపు సిబ్బందిని నియమించకపోవడం వల్ల సమస్యకు కారణంగా చెప్పవచ్చు. ఇప్పుడే ఇలా ఉంటే...శుక్ర, శనివారాల్లో ట్రాఫిక్ పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.

డ్రోన్లు ఉపయోగించండి :

హోం మంత్రి అనిత ఆదేశం

జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయిన విషయం హోం మంత్రి అనిత దృష్టికి వెళ్లడంతో ఆమె కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్‌ను సీసీ టీవీ కెమెరాల ద్వారా పరిశీలిస్తూ వాటిని క్లియర్ చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి ఎక్కడ సమస్య ఉందో తెలుసుకొని క్లియర్ చేయాలని సూచించారు.

ఏకోపాధ్యాయులకు నిరాశ

... 5వ పేజీ తరువాయి

ఏకోపాధ్యాయ పాఠశాల్లో నియమిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని విశాఖ డీఈవో ఎన్. ప్రేమ్‌కుమార్ తెలిపారు. అప్పటివరకూ ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే పనిచేయాల్సిందిగా చెప్పడంతో ఏకోపాధ్యాయులంతా నిరాశ చెందారు. ప్రస్తుతం డీఎస్సీ రాత పరీక్షలు నెలాఖరు వరకు జరుగుతాయి. తరువాత ఫలితాలు విడుదల చేసి నియామక షెడ్యూల్ ఖరారుకు కనీసం రెండు, మూడు నెలలు పడుతుందని ఉపాధ్యాయులు అంచనా వేస్తున్నారు.

4,903 మంది టీచర్లకు బదిలీలు

ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీలలో 4,903 మంది టీచర్లకు బదిలీలు అయ్యాయి. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, లాంగ్వేజ్ పండిట్ల బదిలీలు ఆన్‌లైన్‌లో చేపట్టారు. సెకండరీగ్రేడ్ టీచర్లు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లకు మాత్రం మాన్యువల్‌గా బదిలీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 హెచ్ఎంలు 89 మంది, మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు 177, స్కూల్ అసిస్టెంట్ తత్సమాన హోదా టీచర్లు 2,305 మంది, ఎస్టీటీలు 2,229 మంది, లాంగ్వేజ్ పండిట్లు 78 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 10 మంది, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు 15 మందికి బదిలీ అయింది.

153 మంది టీచర్లకు పదోన్నతి

ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీలలో 153 మంది టీచర్లకు పదోన్నతి కల్పించారు. గ్రేడ్-2 హెచ్ఎంలుగా 72 మంది, మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా 36 మంది, స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఇంగ్లీష్‌లో ఒకటి, హిందీ, తెలుగులో రెండేసి, బయాలజీలో 16, గణితంలో మూడు, సోషల్ స్టడీస్‌లో 9, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 12 మందికి పదోన్నతి వచ్చింది.

యోగాకు ముమ్మర ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

అమర్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ సహా 175 దేశాల ప్రతినిధులు యోగా కార్యక్రమంలో పాల్గొంటారని బుధవారం ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ప్రకటించారు. ఈ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎస్‌పీజీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఆ ప్రాంతం పోలీసుల ఆధీనంలో ఉంది. ఆర్కే బీచ్‌రోడ్డుకు ప్రత్యామ్నాయంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 25 వేల మంది పాల్గొనేలా మరో వేదిక నిర్మించారు. ఇక్కడ కూడా వర్షం పడినా ఇబ్బందిలేకుండా జర్మన్ హ్యాంగర్స్‌తో వాటర్‌ప్రూఫ్ రేకులతో భారీ హాళ్లు ఏర్పాటుచేశారు. సుమారు 25 వేల మంది గిరిజన యువతీ యువకులు యోగాతో పాటు సూర్య నమస్కారాలు చేయనున్నారు. కాగా యోగా దినోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం సాయంత్రం హోం మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు వినియోగించాలని ఆదేశించారు. ట్రాఫిక్ మళ్లింపు నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు అనగాని సత్యప్రసాద్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, బీసీ జనార్దనరెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఇతర ప్రజా ప్రతినిధులు నియోజకవర్గాల్లో సమీక్షలు నిర్వహించి, జన సమీకరణ, రవాణా సదుపాయాలపై సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి జనాల తరలింపునకు టార్గెట్లు ఇచ్చారు. ఇదిలావుండగా యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన కూడళ్లతో పాటు ఆర్కే బీచ్ రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఎన్‌కౌంటర్‌తో కలకలం

... 5వ పేజీ తరువాయి

ఆజాద్ యాక్షన్ టీమ్ సభ్యునిగా ఉంటూ 2016లో కొయ్యూరు మండలం మర్రిపాకలు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. మరో కుమార్తె ఝాన్సీ న్యాయవాది. ఆమె భర్తతో పాటు కరకవానిపాలెంలో ఉంటున్నారు. గతంలో కుమారుడు, ఇప్పుడు కుమార్తె ఎన్‌కౌంటర్‌లో మృతిచెందడంతో ఆ కుటుంబం విషాదంలో ఉంది.

విశాఖ విమల విద్యాలయాల మూత

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి ప్రయత్నం చేయలేదు. దాంతో స్టీల్ యాజమాన్యం ఇప్పుడు డబ్బులు ఇవ్వలేమని చాలా స్పష్టంగా చెప్పింది.

స్కూల్‌ను యథావిధిగా నడపాలి : బి.గంగారాం, 78వ వార్డు కార్పొరేటర్

స్టీల్‌ప్లాంటు యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తును దృష్టితో పెట్టుకొని స్కూల్‌ను యథావిధిగా నడపాలి. పేద పిల్లలు చదువుకునే స్కూల్‌కు యాజమాన్యం అండగా నిలవాలి. స్కూల్ ఆపేయడం వల్ల ఇటు విద్యార్థులు, అటు ఎన్నో ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని, తక్షణమే స్కూల్ తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలి.

యథేచ్ఛగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో డొమెస్టిక్ వంటగ్యాస్ వినియోగం



ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వినియోగిస్తున్న గృహావసర గ్యాస్ సిలిండర్

వెంకోజీపాలెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లను ప్రజలకు ఉచితంగా ఇచ్చి ఏం లాభం. గ్యాస్‌ను డెలివరీ చేసే బాయ్స్ పక్కదోవ పట్టి ఇంటికి వాడాల్సిన గ్యాస్ సిలిండర్‌లను బ్లాక్‌లో అధిక మొత్తానికి ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లకు, హోటళ్లకు విక్రయిస్తూ పబ్బం గడుపుతున్నారు. 19 కిలోల కమర్షియల్ సిలిండర్‌ను వాడాల్సిన వ్యాపారులు యథేచ్ఛగా 16.5 కేజీల వంట గ్యాస్ సిలిండర్లతో వ్యాపారాలను సాగిస్తున్నారు. ఒక పక్క ప్రభుత్వం ఉచిత గ్యాస్ గురించి, గ్యాస్ వినియోగంపై అవగాహనలు కల్పిస్తూ ఉంటే డెలివరీ బాయ్స్ దెబ్బకు ఇలా దుర్వినియోగం అవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ 16వ వార్డులోని కృష్ణా కళాశాల సమీపంలోని వీఆర్డీ స్వీట్స్ అండ్ బేకరీ, శ్రీగణేష్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ల వద్ద గృహావసరాల గ్యాస్ సిలిండర్లేకనిపిస్తున్నాయి. అనేక ఫుట్‌పాత్ వ్యాపారులు కూడా గృహావసరాల గ్యాస్ సిలిండర్లే వినియోగిస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

తల్లిదండ్రులు మందలించారని
అక్కాచెల్లెలు అదృశ్యం

కూర్మన్నపాలెం, జూన్18(ఆంధ్ర జ్యోతి): నిత్యం ఇద్దరు కుమార్తెలు ఫోన్ చూస్తూ ఉండిపోతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని తల్లిదండ్రులు మందలించటంతో ఇద్దరు కుమార్తెలు ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి... దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డులో నివాసముంటున్న షేక్ నాగూర్‌కు ఇద్దరు కుమార్తెలు షేక్ షర్మిళ (20), షేక్ నబీదాబేగమ్ (17). వీరు నిత్యం మొబైల్ చూస్తున్నారని ఈ నెల 11వ తేదిన తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి బయకు వెళ్లిపోయారు. ఐదు రోజుల పాటు పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెతికిన ఫలితం లేకపోవటంతో దువ్వాడ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు, రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంటూరు-రాయగడ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే 17243, 17244 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 18, 19 తేదీల్లో అదనంగా ఒక థర్డ్ ఏసీ కోచ్ జత చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

సినిమా గైడ్

- **డ్రాగన్ 3డి** : జగదాంబ
- **బల్లెరినా** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 20, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 60 , కీర దోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు (బ్యాగ్)

రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180

యోగాంధ్రపై అవగాహన కార్యక్రమాలు



ఎంపీపీ కాలనీ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



వెంకోజీపాలెం : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, ఉపాధ్యాయులు

ఎంపీపీ కాలనీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర విజయవంతం చేయాలని కోరుతూ గ్రేటర్ విశాఖ 21 వార్డు తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతుల మీదుగా బుధవారం పోస్టర్ ఆవిష్కరింపజేశారు. ఎంపీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 21వ వార్డు తెలుగుదేశం, జనసేన నాయకులతో పాటు సచివాలయం ఇన్‌ఛార్జిలు ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి, యోగాంధ్రపై ఎమ్మెల్యే సూచనలు, సలహాలను తీసుకున్నారు. వార్డులో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర, ఇన్‌ఛార్జి అవనీష్, జనసేన వార్డు అధ్యక్షులు నందితరావు, సచివాలయాల సీవో ఇందు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 21న అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న యోగాంధ్రకు మరింత ప్రచారం తీసుకొచ్చేందుకు నగరంలోని వివిధ సంస్థలు తమ వంతుగా ప్రచారం చేపట్టాయి. ఎంపీపీ కాలనీలోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. యోగాంధ్రలో అందరూ పాల్గొనాలని, గిన్నిస్ రికార్డు సాధిద్దాం, యోగా చేద్దాం ఆరోగ్యంగా ఉందాం అంటూ నినదించారు. సంస్థ సీఈవో జ్యోతి, డీన్ రమ, ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు యోగాసనాలు వేశారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల వద్ద యోగా డేపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా యోగా డే వాల్‌పోస్టర్‌ను కార్పొరేటర్ ఆవిష్కరించారు. అనంతరం వాటిని స్కూల్ గోడలపై అతికించారు. ఈ నెల 21న నిర్వహించే ప్రపంచ యోగాడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, ఇసుకతోటలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల వద్ద ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. దీంతోపాటు పాత వెంకోజీపాలెంలోని రోజరీ కాన్వెంట్ వద్ద విద్యార్థులతో యోగాను కార్పొరేటర్ చేయించారు. కార్యక్రమంలో శ్రీసీతారామ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి వెంకటఅప్పారావు, గ్రామస్థులు మళ్ల వెంకటి, పీల పెద్ద, శరగడం సుధాకర్, సంపంగి సురేష్, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ జ్యోతి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెదవాల్తేరులో..

పెదవాల్తేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ కోరారు. బుధవారం ఉషోదయ జంక్షన్ వద్ద గల పట్టాభి రామ్ కార్యాలయంలో 17, 19 వార్డుల సంబంధిత అధికారులు, కూటమి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుధ ఛైర్మన్, జనసేన నాయకుడు కోరికన రవికుమార్ విచ్చేసి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉండాలంటే అందరూ యోగా చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో గేదెల నాగరాజు, నెకంటి సత్తిబాబు, తేడ్డు రాజు, శ్రీనివాస్ పట్నాయక్, నరేంద్ర, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న నిర్వహించనున్న యోగా డేకు ప్రతి సచివాలయం నుంచి కనీసం నాలుగు వందల మందిని తరలించాలని 'యోగా డే' తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి వార్డు సచివాలయం సిబ్బందికి ఆదేశించారు. యోగాను అందరు కలసి దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం తోటగరువులో గల రాధాకృష్ణ కల్యాణ మండపంలో సచివాలయ సిబ్బంది, ఆర్పీలతో కలసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, జీవీఎంసీ 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 9వ వార్డు ఇన్‌ఛార్జి బుడుమూరు గోవింద్, 9, 10, 11, 12, 13 వార్డులకు చెందిన ప్రధాన నాయకులు, జడ్సీ-2 కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలు

ఈ నెల 21న రామకృష్ణా బీచ్ నుంచి భీమిలి వరకూ నిర్వహిస్తున్న యోగా డేను విజయవంతం చేయాలని 11 వవార్డు ఇన్‌ఛార్జి రాగతి అచ్యుతరావు వార్డు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే 10వ వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో యోగా ర్యాలీ రవీంద్రనగర్ నుంచి ఆదర్శనగర్ వరకూ చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహాలక్ష్మి యోగాపై ప్రజలకు అవగాహన కలిగించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ఆరిలోవ : సమావేశంలో మాట్లాడుతున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రసింహారెడ్డి



ఆరిలోవ : యోగాంధ్ర అవగాహన ర్యాలీ

దుర్గంధం.. భరించలేకున్నాం

- శ్రీకాంత్ నగర్ వాసుల ఆవేదన
- కాలువల్లో పూడికలు తీయాలంటూ వినతి



శ్రీకాంత్ నగర్ 8 వీధిలో గల కాలువలో పేరుకుపోయిన పూడిక

ఆరిలోవ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల శ్రీకాంత్ నగర్ లేఅవుట్‌లో గల 8వ వీధిలోని ప్రధాన కాలువ పూడికలతో నిండిపోయింది. దీంతో ఈ కాలువ దోమలకు నిలయంగా మారింది. కాలువలో పూడిక తొలగింపు చర్యలను పారిశుధ్య సిబ్బంది చేపట్టకపోవడంతో తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పారిశుధ్య విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలువలో పూడిక తీతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాలువలో వ్యర్థాలు నిండిపోవడంతో నిలిచిపోయిన మురుగునీరు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పెదవాల్తేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అనాథ మృతదేహానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి సొసైటీ షెల్టర్ మేనేజర్ ఎ.మురళీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్కే బీచ్‌లో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు 2019, జూన్ 10న ఫీల్డ్ వర్క్ చేస్తుండగా, ఆ ప్రాంతంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న నామాల వెంకటేశ్ (40)ని గుర్తించి, పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అతడి మానసిక పరిస్థితి మెరుగు కావడంతో హోంకు తీసుకొచ్చారు. అయితే అతడుతమ వారు, స్వస్థలం గురించి సరిగా చెప్పలేకోయేవాడని హోం మేనేజర్ మురళి తెలిపారు.ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట అస్వస్థతకు గురైతే కేజీహెచ్‌లో చేర్పించినట్టు చెప్పారు. అయితే చికిత్స పొందుతూ వెంకటేశ్ఈ నెల 14న రాత్రి 10 గంటలకు మృతి చెందినట్టు తెలిపా రు. ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ సీఐ మురళి ఆదేశాల మేరకు హెచ్‌సీ రాంబాబు సమక్షం లో వెంకటేష్ మృతదేహానికి జ్ఞానపురం శ్మశా న వాటికలో అంత్యక్రియలునిర్వహించినట్టు చెప్పారు.

ఏఎన్ఎంలను సొంత మండలాలకు బదిలీ చేయాలి

పెదగంట్యాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు/ఏఎన్ఎంలను సొంత మండలాలకు బదిలీ చేయాలని కోరుతూ వారు వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది మే 31 నాటికి ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సచివాలయ ఉద్యోగులకు బదిలీ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల అందజేత

ఎంవీపీ కాలనీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ చికిత్స చేయించుకుంటున్న కొందరు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందింది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయంలో బాధితులకు చెక్కులు అందజేశారు. జీవీఎంసీ 13, 15 వార్డులకు సంబంధించిన వారికి వీటిని బుధవారం అందించారు. కొత్త వెంకోజీపాలేనికి చెందిన బోర యమునకు రూ. లక్ష, సూరిశెట్టి రాముకు 94,780లు, సింహాద్రిపురం ప్రాంతానికి చెందిన తాడాల శేషగిరికి రూ. 1,56,016లు, మద్దిలపాలేనికి చెందిన కాకి లక్ష్మీకి రూ. 35 వేలు, చినగదిలికి చెందిన కొండపల్లి శివకుమార్‌కు రూ. 38,311లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే సంబంధికులకు అందజేశారు. కార్యక్రమంలో వెలగపూడి ప్రతాప్‌రుద్ర, బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, గొలగాని మంగవేణి పోలారావు, గేదెల లావణ్యనాగరాజు, బొట్ట వెంకటరమణ, బైరెడ్డి పోతనరెడ్డి, నక్క కనకరాజు, తెడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

క్రీడా స్థలం ఏర్పాటు చేయరూ..

- రాజీవ్‌నగర్ యువత వినతి

ఆరిలోవ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జీవీ ఎంసీ 10వ వార్డులో గల రాజీవ్‌నగర్‌లోఆట స్థలం లేక ఇక్కడ విద్యార్థులు, యువకులు ఇబ్బం ది పడుతున్నారు. దీంతో వీరు అటవీ శాఖకు చెందిన కంబాలకొండ స్థలంలో ఆటలు ఆడుకుంటున్నా రు. సెలవు దినాల్లో కాసేపు ఆటలు ఆడు కుందామన్నా తమ ప్రాంతంలో స్థలం లేక ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆటవీ శాఖ స్థలంలో షటిల్, వాలీబాల్ వంటివి ఆడుతున్నామని, అయితే ఆ శాఖ అధికారులు కొందరు కొన్నిసార్లు అభ్యంతరం చెబుతున్నారని అంటున్నారు.

ఇప్పటికైనా అధికారులు తమ ప్రాంతంలో ఆట స్థలానికి జాగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



క్రీడా మైదానం లేక అటవీ శాఖ స్థలంలో ఆడుకుంటున్న విద్యార్థులు

పూడిక తీసి రోడ్డు పక్కనే వదిలేశారు

- 15వ వార్డు హెచ్‌బీ కాలనీలో తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు

వెంకోజీపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులు కాలువల్లో వ్యర్థాలను బయటకు తీసి రోడ్డు పక్కనే విడిచి పెట్టడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీ నుంచి సింహాద్రిపురం కొండవాలు ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఈ విధంగా కాలువ నుంచి తీసిన పూడిక, వ్యర్థాలను కుప్పలుగా పోసి విడిచిపెట్టారు. దీంతో తీవ్ర దుర్గంధం వెలువడుతున్నది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఈ వ్యర్థాలు రోడ్లపైకి వచ్చేస్తోంది. ఫలితంగా పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొని అటుగా రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా శా నిటరీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ వేసిన వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హెచ్‌బీ కాలనీలో కాలువ నుంచి తీసి రోడ్డు పొడవునా కుప్పలుగా వేసిన పూడిక

ఆర్టీసీ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి
- లంకెలపాలెం-ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్ బస్సు సర్వీసు ప్రారంభించిన అమాత్యుడు



లంకెలపాలెం-ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్‌కు బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోను గురువారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి ప్రయాణికులు, కార్మికులు రెండు కళ్లు వంటివారన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతుందన్నారు. సిబ్బంది, సంస్థ మనుగడే ధ్యేయంగా కార్మికులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. సీఎం చంద్రబాబు, పీఎం మోదీతో మాట్లాడి ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంటు కొనసాగేలా చూస్తానని పేర్కొన్నారు. స్టీల్ సిటీ డిపోకు కేటాయించిన స్థలం లీజు పూర్తయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడి డిపోలో ప్రస్తుతం 70 బస్సులు ఉన్నాయని, వీటిని వందకు పెంచుతామన్నారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను మంత్రి నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు.

బస్సు ప్రారంభం

లంకెలపాలె నుంచి ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్‌కు నూతన బస్సును రాంప్రసాద్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఆర్ఎం బి.అప్పలనాయుడు, డిపో మేనేజర్ గౌతం చటర్జీ, ఏడీఎం పి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏడీసీ, మేనేజర్ అశ్విని పాల్గొన్నారు.

విద్యాకిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న గోవింద్, పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆరిలోవ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని జీవీఎంసీ 9వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్ అన్నారు. బుధవారం పెదగదిలి మండల ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన, వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే పథకాలు, సదుపాయాలను సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలన్నారు. 'తల్లికి వందనం' డబ్బులు ఇంకా ఎవరికైనా వారి అకౌంట్‌లో పడకుంటే వారు సంబంధిత సచివాలయానికి వెళ్లి సంప్రదించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా డేకు విదేశీ విద్యార్థులు సన్నద్ధం

- ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్న ఏయూ యోగా విభాగం



యోగాసనాలు సాధన చేస్తున్న ఏయూ విదేశీ విద్యార్థులు

సిరిపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) :అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థులు సిద్ధమవుతున్నారు. గత కొన్ని రోజులుగా విదేశీ విద్యార్థులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగవిభాగం పరిశోధకులు, పీజీ విద్యార్థులు ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ 21న బీచ్‌రోడ్డులో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటారు. ఏయూ తరఫున సుమారు 200 మంది విదేశీ విద్యార్థులు హాజరవుతారు. వీరికి యోగా విధానం, యోగా కామన్ ప్రోటోకాల్‌పై అవగాహన కల్పించారు.

యోగాంధ్రలో ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొనాలి



ఏయూలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయ రావు, యోగా విభాగాధిపతి కె.రమేష్‌బాబు, ఏయూ ఉద్యోగులు

సిరిపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్ర కార్యక్రమాల్లో ఏయూ ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొనాలని వర్సిటీ అధికారులు పేర్కొన్నారు. బుధవారం యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారంతా తమకు కేటాయించిన ప్రాంతంలో యోగా సాధనకు హాజరు కావాలన్నారు. ఉద్యోగులు ఇటువంటి కార్యక్రమాలకు ప్రచారం నిర్వహించడం, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఎంతో మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, యోగా విభాగాధిపతి కె.రమేష్‌బాబు, ఉద్యోగులు తిరుపతిరావు, అమరేంద్ర, నూకరాజు, దేవుడు, బాలరాం, యాసిన్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' చర్చలు మళ్లీ వాయిదా

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘాల మధ్య రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో బుధవారం జరిగిన చర్చలు మళ్లీ వాయిదా పడ్డాయి. కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టి, నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ మధ్యలో రెండుసార్లు చర్చలు జరిగినా ఆ సమావేశాలకు ఉక్కు యాజమాన్య ప్రతినిధులు హాజరు కాలేదు. తాజాగా బుధవారం జరిగిన చర్చల్లో కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఎవరినీ తొలగించరాదని కోరారు. అయితే దీనిపై యాజమాన్య ప్రతినిధులు ఎటువంటి హామీ ఇవ్వలేదని నాయకులు పేర్కొన్నారు కాగా సంస్థకు చెందిన కాంట్రాక్టర్లు హాజరు కాకపోవడంతో ఈ చర్చలను ఈ నెల 26వ తేదికి వాయిదా వేసినట్టు వారు తెలిపారు.

యోగాంధ్ర నిర్వహణకు విస్తృత సన్నాహాలు

» 'ఉత్తర'లో సమన్వయపరిచిన మున్సిపల్ మంత్రి నారాయణ » రైల్వే క్రికెట్ మైదానం సిద్ధం » అంతటా కొనసాగుతున్న ఆసనాల సాధన » విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు



తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, చిత్రంలో మంత్రి నారాయణ, పత్తిపాటి పుల్లారావు తదితరులు

సీతమ్మధార, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమ సన్నాహాలు పరిశీలించేందుకు ఎమ్మెల్యే కార్యాలయానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, పత్తిపాటు పుల్లారావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, నజీర్, ఉషాకిరణ్, సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రాము, శివప్రసాద్ తదితరులు విచ్చేశారు. నిర్వహణ ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అందరినీ సమన్వయపరిచారు.

మురళీనగర్‌లో యోగాంధ్రపై అవగాహన

మాధవధార, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వైశాఖీస్పోర్ట్సు పార్కు సమావేశ మందిరంలో బుధవారం యోగాంధ్ర పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. మనదైన వారసత్వంగా యోగా ప్రపంచానికి పరిచయమైందన్నారు. మందులు, ఆసుపత్రి చికిత్సల పనిలేకుండా మన నేలపై పుట్టిన యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆరోగ్య సాధనకు అలవాటుగా చేసుకోవాలని సూచించారు. విశాఖలో 21న జరగనున్న యోగోత్సవ కార్యక్రమానికి అంతా హాజరుకావాలన్నారు. టీడీపీ, జనసేన నాయకులు ఎస్.వరప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. కాలనీల నుంచి మహిళలు, స్థానికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆసనాల సాధన

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ మైదానంలో భారీ సంఖ్యలో యోగాసనాల ప్రదర్శనకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. డివిజన్ వ్యాప్తంగా నాలుగు రోజుల నుంచి ప్రారంభించిన యోగా సాధన కొనసాగుతోంది. యోగాసనాల నిపుణుల శిక్షణ, పర్యవేక్షణలో వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం, అరకు, రాయగడ, కొరాపుట్, జగదల్‌పూర్ రైల్వే స్టేషన్ల ఆవరణలలో బుధవారం జరిగిన యోగా సాధనలో ఉద్యోగులు, సిబ్బంది, స్కౌట్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు పాల్గొని సాధన చేశారు. ఈ నెల 21న ఉదయం వాల్తేరు రైల్వే క్రికెట్ మైదానంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొని ఆసనాలు ప్రదర్శించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ చిన్నతనం నుంచే యోగా సాధన అలవాటు చేయాలన్నారు. ఆసనాల ద్వారా మానసిక, శారీరక సమతుల్యం పొందడంతో పాటు ఆందోళన, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునని పేర్కొన్నారు. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచి సానుకూల దృక్పథాన్ని పెంచే యోగా సాధనను రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని యోగా సనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

అల్లిపురం: నగరంలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకుడు, 32 వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం వార్డు కార్యాలయంలో ఆర్‌పీలు, వార్డు కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలతో సమన్వయం చేసుకొని యోగాంధ్రను జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు.

వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహాల్లో భాగంగా వాల్తేరు రైల్వే బుధవారం వివిధ పోటీలు నిర్వహించింది. ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక పాఠశాలల విద్యార్థులకు పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించింది. సుమారు వంద మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా ప్రయోజనాలను వివరించే డ్రాయింగ్‌లను ప్రదర్శించారు. డివిజన్ వ్యాప్తంగా రైల్వే ఉద్యోగులకు వ్యాసరచన పోటీలు నిర్వహించింది. యోగా సాధన-ప్రయోజనాలు, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత-ఆధ్యాత్మిక పునరుద్ధరణ వంటి అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగాపై రైల్వే కాలనీలలో సిబ్బంది, స్కౌట్ అండ్ గైడ్స్ అవగాహన కల్పించారు.



వాల్తేరు రైల్వేవారు నిర్వహించిన పోటీల్లో డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతానికి జగన్ యత్నం

» హోం మంత్రి వంగలపూడి అనిత

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతానికి వైసీపీ అధినేత జగన్ ప్రయత్నిస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. విశాఖ బీచ్ రోడ్డులో ఈ నెల 21న చేపట్టనున్న యోగాంధ్ర ఏర్పాట్లను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నేరస్థుడు రాజకీయ నాయకుడైతే ఎలా ఉంటుందో జగన్‌ను చూస్తే అర్థమవుతుందన్నారు. ఏడాదిలో జగన్ పరామర్శలకు వెళ్లడమే అజెండాగా చేసుకున్నారని ఎద్దేవా చేశారు. జగన్ పర్యటనల్లో రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. బెట్టింగ్‌ల్లో డబ్బు పోగొట్టుకుని నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుంటే దానిని పోలీసులపైకి నెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. గత ఏడాది జూన్‌లో నాగమల్లేశ్వరరావు మృతిచెందితే...ఇప్పుడు ఆ కుటుంబాన్ని పరామర్శించడం జగన్ శవ రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. తాజాగా బుధవారం జగన్ కాన్వాయ్ ఢీకొని వైసీపీ కార్యకర్త చనిపోతే కనీసం స్పందించలేదని, చివరికి పోలీసులు ఆస్పత్రికి తరలించారన్నారు. రాజకీయం ముసుగులో జగన్ కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. అంతర్జాతీయ యోగా వేడుకల నేపథ్యంలో రాష్ట్రంలో అలజడి సృష్టించాలని జగన్ చూస్తున్నారని విమర్శించారు. జగన్‌లాంటి వ్యక్తి సమాజంలో ఉండడానికి వీలు లేదన్నారు. సినిమా చూపిస్తాం.. తాట తీస్తామనడం వంటి దిగజారుడు మాటలు ఆ పార్టీ నేతల దివాళాకోరుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

యోగా సన్నాహాల కోసం నేడు వాక్‌థాన్

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా వేడుకల సన్నాహాల్లో భాగంగా విస్తృత ప్రచారం కోసం గురువారం ఉదయం ఆరుగంటలకు ఏయూ కన్వెన్షన్ హాలు నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకు వాక్‌థాన్ నిర్వహిస్తున్నారు. అనంతరం అధికారులు, శిక్షకులు, ప్రజలు యోగాసనాలు వేస్తారని కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున వాక్‌థాన్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు: విజయనగరం ఎస్పీ వకుళ్

సాగర్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బుధవారం ఆయన రుషికొండ ఏ-1 ఫంక్షన్‌లో హాల్‌లో బందోబస్తు, భద్రతా విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఐటీ సెజ్ నుంచి కాపులుప్పాడ వరకు ఏర్పాటు చేసిన 59 కంపార్టుమెంట్లలో విస్తృత స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలనిసూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

ఎన్‌కౌంటర్‌తో కలకలం

(5వ పేజీ తరువాయి)

ఆజాద్ యాక్షన్ టీమ్ సభ్యునిగా ఉంటూ 2016లో కొయ్యూరు మండలం మర్రిపాకలు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. మరో కుమార్తె ఝాన్సీ న్యాయవాది. ఆమె భర్తతో పాటు కరకవానిపాలెంలో ఉంటున్నారు. గతంలో కుమారుడు, ఇప్పుడు కుమార్తె ఎన్‌కౌంటర్‌లో మృతిచెందడంతో ఆ కుటుంబం విషాదంలో ఉంది.

విశాఖ విమల విద్యాలయాల మూత

(5వ పేజీ తరువాయి)

ఎటువంటి ప్రయత్నం చేయలేదు. దాంతో స్టీల్ యాజమాన్యం ఇప్పుడు డబ్బులు ఇవ్వలేమని చాలా స్పష్టంగా చెప్పింది.

స్కూల్‌ను యథావిధిగా నడపాలి

స్టీల్‌ప్లాంటు యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తును దృష్టితో పెట్టుకొని స్కూల్‌ను యథావిధిగా నడపాలి. పేద పిల్లలు చదువుకునే స్కూల్‌కు యాజమాన్యం అండగా నిలవాలి. స్కూల్ ఆపేయడం వల్ల ఇటు విద్యార్థులు, అటు ఎన్నో ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని, తక్షణమే స్కూల్ తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలి.

- బి.గంగారాం, 78వ వార్డు కార్పొరేటర్

యోగాకు ముమ్మర ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

అమర్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ సహా 175 దేశాల ప్రతినిధులు యోగా కార్యక్రమంలో పాల్గొంటారని బుధవారం ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రకటించారు. ఈ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎస్‌పీజీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఆ ప్రాంతం పోలీసుల ఆధీనంలో ఉంది. ఆర్కే బీచ్‌రోడ్డుకు ప్రత్యామ్నాయంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 25 వేల మంది పాల్గొనేలా మరో వేదిక నిర్మించారు. ఇక్కడ కూడా వర్షం పడినా ఇబ్బందిలేకుండా జర్మన్ హ్యాంగర్స్‌తో వాటర్‌ప్రూఫ్ రేకులతో భారీ హాళ్లు ఏర్పాటుచేశారు. సుమారు 25 వేల మంది గిరిజన యువతీయువకులు యోగాతో పాటు సూర్య నమస్కారాలు చేయనున్నారు. కాగా యోగా దినోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం సాయంత్రం హోం మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు వినియోగించాలని ఆదేశించారు. ట్రాఫిక్ మళ్లింపు నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు అనగాని సత్యప్రసాద్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, బీసీ జనార్దనరెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు నియోజకవర్గాల్లో సమీక్షలు నిర్వహించి, జన సమీకరణ, రవాణా సదుపాయాలపై సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి జనాల తరలింపునకు టార్గెట్లు ఇచ్చారు. ఇదిలావుండగా యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన కూడళ్లతో పాటు ఆర్కే బీచ్‌రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఉక్కులో దిద్దుబాటు

(5వ పేజీ తరువాయి)

వేగంగా పూర్తి చేయడానికి మెకానికల్, ఎలక్ట్రికల్, సేఫ్టీ ప్రాజెక్ట్ విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని వేసింది. వారిని సమన్వయం చేసే బాధ్యతలను వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్‌కు అప్పగించింది. కమిటీ నియామకంపై ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. తాము ఈ పనులు చేయాలనే మొత్తుకుంటున్నామని, ఎవరు చేసినా తమకు అభ్యంతరం లేదని, ప్రమాదాలకు ఆస్కారం లేని పని వాతావరణం కల్పించాలనేదే తమ డిమాండ్ అని పేర్కొన్నాయి.

హైవేపై ట్రాఫిక్ జామ్

(5వ పేజీ తరువాయి)

సమయం పట్టింది. ముఖ్యంగా విశాఖ వేలీ స్కూల్ జంక్షన్ నుంచి మద్దిలపాలెం రావడానికి గంటన్నర పట్టింది. ఉదయం 10 గంటలకు మొదలైన ఈ సమస్య రాత్రి 10 గంటల వరకూ కొనసాగింది. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయినవారు చాలా ఇబ్బందిపడ్డారు. పోలీసులంతా బీచ్‌రోడ్డుకే పరిమితం కావడం, ట్రాఫిక్ క్లియర్ చేయడానికి అదనపు సిబ్బందిని నియమించకపోవడం వల్ల సమస్యకు కారణంగా చెప్పవచ్చు. ఇప్పుడే ఇలా ఉంటే...శుక్ర, శనివారాల్లో ట్రాఫిక్ పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.

డ్రోన్లు ఉపయోగించండి : హోం మంత్రి

జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయిన విషయం హోం మంత్రి అనిత దృష్టికి వెళ్లడంతో ఆమె కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్‌ను సీసీ టీవీ కెమెరాల ద్వారా పరిశీలిస్తూ వాటిని క్లియర్ చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి ఎక్కడ సమస్య ఉందో తెలుసుకొని క్లియర్ చేయాలని సూచించారు.

ఏకోపాధ్యాయులకు నిరాశ

(5వ పేజీ తరువాయి)

ఏకోపాధ్యాయ పాఠశాల్లో నియమిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. అప్పటివరకూ ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే పనిచేయాల్సిందిగా చెప్పడంతో ఏకోపాధ్యాయులంతా నిరాశ చెందారు. ప్రస్తుతం డీఎస్సీ రాత పరీక్షలు నెలాఖరు వరకు జరుగుతాయి. తరువాత ఫలితాలు విడుదల చేసి నియామక షెడ్యూల్ ఖరారుకు రెండు, మూడు నెలలు పడుతుందని ఉపాధ్యాయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

4,903 మంది టీచర్లకు బదిలీలు

ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీలలో 4,903 మంది టీచర్లకు బదిలీలు అయ్యాయి. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, లాంగ్వేజ్ పండిట్ల బదిలీలు ఆన్‌లైన్‌లో చేపట్టారు. సెకండరీగ్రేడ్ టీచర్లు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లకు మాత్రం మాన్యువల్‌గా బదిలీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు 89 మంది, మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు 177, స్కూల్ అసిస్టెంట్ తత్సమాన హోదా టీచర్లు 2,305 మంది, ఎస్జీటీలు 2,229 మంది, లాంగ్వేజ్ పండిట్లు 78 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 10 మంది, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు 15 మందికి బదిలీ అయింది.

153 మంది టీచర్లకు పదోన్నతి

ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీలలో 153 మంది టీచర్లకు పదోన్నతి కల్పించారు. గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా 72 మంది, మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా 36 మంది, స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఇంగ్లీష్‌లో ఒకటి, హిందీ, తెలుగులో రెండేసి, బయాలజీలో 16, గణితంలో మూడు, సోషల్ స్టడీస్‌లో 9, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 12 మందికి పదోన్నతి వచ్చింది.

వాలీబాల్ క్రీడాకారుడు మౌర్యకు అభినందన



తల్లిదండ్రులతో ఉన్న మౌర్యను అభినందిస్తున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

విశాఖపట్నం స్పోర్ట్సు జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వాలీబాల్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మౌర్య నందమూడిని విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. ఉజ్బెకిస్థాన్‌లో జరిగిన సెంట్రల్ ఏషియన్ వాలీబాల్ అసోసియేషన్ (కావా) అండర్-19 పురుషుల ఇంటర్నేషనల్ వాలీబాల్ లీగ్ చాంపియన్‌షిప్ -2025 టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమన్నారు. యువ వాలీబాలర్ మౌర్య తండ్రి శ్యామ్, పోర్టు అథారిటీ ఉద్యోగి కావడమే కాకుండా ఉన్నత స్థాయి క్రికెటర్‌గా సంస్థకు సేవలందించడం గర్వకారణమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే మౌర్య అంతర్జాతీయ వాలీబాలర్‌గా గుర్తింపు పొందడం విశేషమన్నారు. పోర్టు అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్ మాట్లాడుతూ క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదలతో సాధన చేసి భవిష్యత్తులో భారత వాలీబాల్ జట్టులో సుస్థిర స్థానం సాధించి దేశానికి పతకాలు అందించాలని ఆకాంక్షించారు. పోర్టు అధికారులు పలువురు మౌర్యను అభినందించారు.

యెర్నిమాంబ ఆదాయం రూ.17.22 లక్షలు



ఆలయంలో హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

జ్ఞానాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం యెర్నిమాంబ ఆలయంలో దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బుధవారం హుండీలో కానుకలు లెక్కించారు. మే 12 నుంచి జూన్ 19 వరకు 38 రోజులకు రూ.17,22,154 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌బాబా తెలియజేశారు.

నిరాశ్రయులకు ఆశ్రయం



వసతిగృహంలో నిరాశ్రయులు

అక్కయ్యపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఏయూటీడీ సిబ్బంది, రైల్వే పోలీసుల సహకారంతో చేసిన రెస్క్యూ ఆపరేషన్‌లో 8 మంది నిరాశ్రయులను టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఒడిశా, బీహార్, బొబ్బిలి, కొత్తవలస, అన్నవరం, వడ్లపూడి, దువ్వాడ ప్రాంతాలకు చెందిన 8 మందిని రైల్వే పోలీసుల సహకారంతో నిరాశ్రయుల వసతి గృహానికి తరలించినట్లు చెప్పారు.

పల్లా కుటుంబానికి మంత్రి సబిత పరామర్శ



పల్లా సింహాచలం చిత్రపటం వద్ద నమస్కరిస్తున్న మంత్రి సబిత, చిత్రంలో గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు

సీతంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి బుధవారం విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సబిత సీతంపేట రాజేంద్రనగర్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఇంటికి విచ్చేశారు. పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం ఇటీవల మృతిచెందడంతో ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పల్లా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి తన సానుభూతి తెలిపారు. ఇదిలా ఉండగా పల్లా శ్రీనివాసరావు ఇంటికి పలువురు ఇతర నాయకులు కూడా వేర్వేరుగా విచ్చేసి పరామర్శించారు. సింహాచలం చిత్రపటం వద్ద పూలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'అందని ద్రాక్షలా సంక్షేమ పథకాలు'



మూల వెంకటరావు

మురళీనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని వర్గాలకు సమానంగా సంక్షేమ పథకాలు అందాలన్నది ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఆలోచన అని బీజేపీ నాయకుడు మూల వెంకటరావు అన్నారు. అయితే కొన్ని నిబంధనల కారణంగా పేదవర్గాలకు సంక్షేమ పథకాలు సరిగా అందడం లేదని, దీనిపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి సారించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ సబ్సిడీలు విశాఖ ఉత్తర నియోజకవర్గం సహా నగర వ్యాప్తంగా కొందరు పేదలు అందుకోలేకపోయారని అన్నారు. ప్రభుత్వం వీరిని ఆదుకోవాలన్నారు. నెలకు రూ.15 వేల జీతం మాత్రమే వచ్చే ఆప్కాస్ ఉద్యోగులు ఈ పథకాలు పొందలేకపోయారని అన్నారు. వేతన పరిమితిని రూ.25వేలకు పెంచి వీరిని అర్హులుగా ప్రకటించాలని వెంకటరావు సూచించారు. తల్లికి వందనం పథకంలోనూ పేద వర్గాలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలే పేదలకు కొండంత అండగా నిలుస్తున్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వెంకటరావు కోరారు.

ప్రతిభావంత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్పులు అందుకున్న విద్యార్థులతో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

అల్లిపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 33వ వార్డు జీవీఎంసీ మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్పులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విచ్చేశారు. 538, 532 మార్కులు సాధించిన దీపిక, జి.ఎర్రమ్మలకు రూ.10 వేలు వంతున, 523 మార్కులు వచ్చిన ఒ.చాందినికి రూ.8 వేలు స్కాలర్‌షిప్‌లను జీకే ఫౌండేషన్ అధినేత గోపికృష్ణ, కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి సారథ్యంలో ఎమ్మెల్యే ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగభూషణం, జనసేన నాయకులు శివప్రసాద్ రెడ్డి, ఆకుల రాజు, టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



పుషప్స్ తీస్తున్న విద్యార్థినులు

అక్కయ్యపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల మూడో బ్యాచ్ కోసం బుధవారం ఎంపిక కార్యక్రమం జరిగింది. 11ఏ జేడీ ట్రూప్ కమాండర్, పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎంవీ విశ్వనాథం నేతృత్వంలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో విద్యార్థులకు సుబేదార్ మేజర్ జయప్రకాశ్, హవల్దార్ శ్యామలరావు, హవల్దార్ శుక్రరాజ్‌లు పరుగు పందెం, పుషప్స్, శారీరక పరీక్షలు నిర్వహించి అందులో విజయం సాధించిన 26 మందిని ఎంపిక చేశారు. వీరందరినీ ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, ఆంధ్ర బెటాలియన్ కమాండర్ కల్నల్ అజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

ఈ రహదారులపై రాకపోకలకు గుబులే!

» 31వ వార్డులో రాళ్లుతేలిన మార్గం » ఎల్ఐసీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు గోతులే » రాత్రి వేళ వాహనదారులకు ప్రమాదాలు

డాబాగార్డెన్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ప్రాంతాల్లో రహదారులపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు, ప్రయాణికులు హడలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వార్డులోని జైల్‌రోడ్డు, కృష్ణాగార్డెన్స్, లలితాకాలనీలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఎల్ఐసీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో సమస్య మరింత జటిలంగా తయారైంది. పెద్ద బస్సులతో పాటు నిత్యం వేలాది వాహనాలు ఈ సర్కిల్ చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొన్ని వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సరిగ్గా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లే మార్గమే కాకుండా నిత్యం వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారు సైతం ఈ రహదారులను చూసి అవాక్కవుతున్నారు. సంబంధిత అధికారులు గోతులు నిండిన రహదారులకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణమే రహదారులపై మరమ్మతులు చేపట్టకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు పాదచారులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో గోతుల రహదారి

దారుణ స్థితిలో రహదారి

ఆర్టీసీ కాంప్లెక్స్ టీఎస్సార్ వాటర్ టాంక్ వద్ద రోడ్డు దారుణంగా ఉంది.ఇక్కడ వచ్చే సమయంలోని ఒక్కసారిగా గోతుల్లో పడిన వాహనాలపై కిందకు పడి ప్రమాదాలకు గురవుతున్నారు.అసలు ముఖ్యమైన కూడళ్లను రహదారులు దెబ్బతిన్న ఎందుకు పట్టించుకోవడం లేదు.

-వై.సురేష్‌బాబు, డాబాగార్డెన్స్

తక్షణమే మరమ్మతు చేపట్టండి

కృష్ణాగార్డెన్స్ నుంచి జైల్‌రోడ్డుమీదుగా అంబేడ్కర్ సర్కిల్‌కు వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. వేగంగా వచ్చే వాహనాలు, మలుపు తిరిగేటప్పుడు కొందరు వాహనదారులు ఒకరి వెనుక మరొకరు వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

-ఎల్.నీలవేణి, కృష్ణాగార్డెన్స్

యోగాంధ్రపై అవగాహన కార్యక్రమాలు



ఎంపీపీ కాలనీ : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



వెంకోజీపాలెం : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, ఉపాధ్యాయులు

ఎంపీపీ కాలనీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర విజయవంతం చేయాలని కోరుతూ గ్రేటర్ విశాఖ 21 వార్డు తెలుగుదేశం నాయకులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతుల మీదుగా బుధవారం పోస్టర్ ఆవిష్కరింపజేశారు. ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 21వ వార్డు తెలుగుదేశం, జనసేన నాయకులతో పాటు సచివాలయం ఇన్‌ఛార్జిలు ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి, యోగాంధ్రపై ఎమ్మెల్యే సూచనలు, సలహాలను తీసుకున్నారు. వార్డులో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర, ఇన్‌ఛార్జి అవనీష్, జనసేన వార్డు అధ్యక్షులు నందితరావు, సచివాలయాల సీవో ఇందు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 21న అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న యోగాంధ్రకు మరింత ప్రచారం తీసుకొచ్చేందుకు నగరంలోని వివిధ సంస్థలు తమ వంతుగా ప్రచారం చేపట్టాయి. ఎంవీపీ కాలనీలోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. యోగాంధ్రలో అందరూ పాల్గొనాలని, గిన్నిస్ రికార్డు సాధిద్దాం, యోగా చేద్దాం ఆరోగ్యంగా ఉందాం అంటూ నినదించారు. సంస్థ సీఈవో జ్యోతి, డీన్ రమ, ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు యోగాసనాలు వేశారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల వద్ద యోగా డేపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా యోగా డే వాల్‌పోస్టర్‌ను కార్పొరేటర్ ఆవిష్కరించారు. అనంతరం వాటిని స్కూల్ గోడలపై అతికించారు. ఈ నెల 21న నిర్వహించే ప్రపంచ యోగాడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, ఇసుకతోటలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల వద్ద ఈ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. దీంతోపాటు పాత వెంకోజీపాలెంలోని రోజరీ కాన్వెంట్ వద్ద విద్యార్థులతో యోగాను కార్పొరేటర్ చేయించారు. కార్యక్రమంలో శ్రీసీతారామ సేవా సంఘం అధ్యక్షుడు కర్రి వెంకటఅప్పారావు, గ్రామస్థులు మళ్ల వెంకటి, పీల పెద్ద, శరగడం సుధాకర్, సంపంగి సురేష్, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ జ్యోతి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెదవాల్తేరులో..

పెదవాల్తేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ కోరారు. బుధవారం ఉషోదయ జంక్షన్ వద్ద గల పట్టాభి రామ్ కార్యాలయంలో 17, 19 వార్డుల సంబంధిత అధికారులు, కూటమి నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుధ చైర్మన్, జనసేన నాయకుడు కోరికన రవికుమార్ విచ్చేసి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉండాలంటే అందరూ యోగా చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో గేదెల నాగరాజు, నెకంటి సత్తిబాబు, తేడ్డు రాజు, శ్రీనివాస్ పట్నాయక్, నరేంద్ర, బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న నిర్వహించనున్న యోగా డేకు ప్రతి సచివాలయం నుంచి కనీసం నాలుగు వందల మందిని తరలించాలని 'యోగా డే' తూర్పు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి వార్డు సచివాలయం సిబ్బందికి ఆదేశించారు. యోగాను అందరు కలసి దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం తోటగరువులో గల రాధాకృష్ణ కల్యాణ మండపంలో సచివాలయ సిబ్బంది, ఆర్పీలతో కలసి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు, జీవీఎంసీ 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత, 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, 9వ వార్డు ఇన్‌ఛార్జి బుడుమూరు గోవింద్, 9, 10, 11, 12, 13 వార్డులకు చెందిన ప్రధాన నాయకులు, జడ్సీ-2 కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలు

ఈ నెల 21న రామకృష్ణా బీచ్ నుంచి భీమిలి వరకూ నిర్వహిస్తున్న యోగా డేను విజయవంతం చేయాలని 11 వవార్డు ఇన్‌ఛార్జి రాగతి అచ్యుతరావు వార్డు ప్రజలను కోరారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే 10వ వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో యోగా ర్యాలీ రవీంద్రనగర్ నుంచి ఆదర్శనగర్ వరకూ చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహాలక్ష్మి యోగాపై ప్రజలకు అవగాహన కలిగించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



ఆరిలోవ : సమావేశంలో మాట్లాడుతున్న కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రసింహారెడ్డి



ఆరిలోవ : యోగాంధ్ర అవగాహన ర్యాలీ

దుర్గంధం.. భరించలేకున్నాం

- శ్రీకాంత్ నగర్ వాసుల ఆవేదన
- కాలువల్లో పూడికలు తీయాలంటూ వినతి



శ్రీకాంత్ నగర్ 8 వీధిలో గల కాలువలో పేరుకుపోయిన పూడిక

ఆరిలోవ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల శ్రీకాంత్ నగర్ లేఅవుట్‌లో గల 8వ వీధిలోని ప్రధాన కాలువ పూడికలతో నిండిపోయింది. దీంతో ఈ కాలువ దోమలకు నిలయంగా మారింది. కాలువలో పూడిక తొలగింపు చర్యలను పారిశుధ్య సిబ్బంది చేపట్టకపోవడంతో తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పారిశుభ్య విభాగం అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాలువలో పూడిక తీతకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాలువలో వ్యర్థాలు నిండిపోవడంతో నిలిచిపోయిన మురుగునీరు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పెదవాల్తేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అనాథ మృతదేహానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి సొసైటీ షెల్టర్ మేనేజర్ ఎ.మురళీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆర్కే బీచ్‌లో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు 2019, జూన్ 10న ఫీల్డ్ వర్క్ చేస్తుండగా, ఆ ప్రాంతంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న నామాల వెంకటేశ్ (40)ని గుర్తించి, పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అతడి మానసిక పరిస్థితి మెరుగు కావడంతో హోంకు తీసుకొచ్చారు. అయితే అతడుతమ వారు, స్వస్థలం గురించి సరిగా చెప్పలేకోయేవాడని హోం మేనేజర్ మురళి తెలిపారు.ఈ నేపథ్యంలో రెండు రోజుల కిందట అస్వస్థతకు గురైతే కేజీహెచ్‌లో చేర్పించినట్టు చెప్పారు. అయితే చికిత్స పొందుతూ వెంకటేశ్‌ఈ నెల 14న రాత్రి 10 గంటలకు మృతి చెందినట్టు తెలిపా రు. ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ సీఐ మురళి ఆదేశాల మేరకు హెచ్‌సీ రాంబాబు సమక్షం లో వెంకటేష్ మృతదేహానికి జ్ఞానపురం శ్మశా న వాటికలో అంత్యక్రియలునిర్వహించినట్టు చెప్పారు.

ఏఎన్‌ఎంలను సొంత మండలాలకు బదిలీ చేయాలి

పెదగంట్యాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు/ఏఎన్‌ఎంలను సొంత మండలాలకు బదిలీ చేయాలని కోరుతూ వారు వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది మే 31 నాటికి ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సచివాలయ ఉద్యోగులకు బదిలీ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాల అందజేత

ఎంవీపీ కాలనీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ చికిత్స చేయించుకుంటున్న కొందరు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందింది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయంలో బాధితులకు చెక్కులు అందజేశారు. జీవీఎంసీ 13, 15 వార్డులకు సంబంధించిన వారికి వీటిని బుధవారం అందించారు. కొత్త వెంకోజీపాలేనికి చెందిన బోర యమునకు రూ. లక్ష, నూరిశెట్టి రాముకు 94,780లు, సింహాద్రిపురం ప్రాంతానికి చెందిన తాడాల శేషగిరికి రూ. 1,56,016లు, మద్దిలపాలేనికి చెందిన కాకి లక్ష్మీకి రూ. 35 వేలు, చినగదిలికి చెందిన కొండపల్లి శివకుమార్‌కు రూ. 38,311లు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే సంబంధికులకు అందజేశారు. కార్యక్రమంలో వెలగపూడి ప్రతాప్‌రుద్ర, బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, గొలగాని మంగవేణి పోలారావు, గేదెల లావణ్యనాగరాజు, బొట్ట వెంకటరమణ, బైరెడ్డి పోతనరెడ్డి, నక్క కనకరాజు, తెడ్డు రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

క్రీడా స్థలం ఏర్పాటు చేయరూ..

- రాజీవ్‌నగర్ యువత వినతి

ఆరిలోవ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జీవీ ఎంసీ 10వ వార్డులో గల రాజీవ్‌నగర్‌లోఆట స్థలం లేక ఇక్కడ విద్యార్థులు, యువకులు ఇబ్బం ది పడుతున్నారు. దీంతో వీరు అటవీ శాఖకు చెందిన కంబాలకొండ స్థలంలో ఆటలు ఆడుకుంటున్నా రు. సెలవు దినాల్లో కాసేపు ఆటలు ఆడు కుందామన్నా తమ ప్రాంతంలో స్థలం లేక ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆటవీ శాఖ స్థలంలో షటిల్, వాలీబాల్ వంటివి ఆడుతున్నామని, అయితే ఆ శాఖ అధికారులు కొందరు కొన్నిసార్లు అభ్యంతరం చెబుతున్నారని అంటున్నారు.

ఇప్పటికైనా అధికారులు తమ ప్రాంతంలో ఆట స్థలానికి జాగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



క్రీడా మైదానం లేక అటవీ శాఖ స్థలంలో ఆడుకుంటున్న విద్యార్థులు

పూడిక తీసి రోడ్డు పక్కనే వదిలేశారు

- 15వ వార్డు హెచ్‌బీ కాలనీలో తీవ్ర దుర్గంధంతో ఇబ్బందులు

వెంకోజీపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులు కాలువల్లో వ్యర్థాలను బయటకు తీసి రోడ్డు పక్కనే విడిచి పెట్టడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీ నుంచి సింహాద్రిపురం కొండవాలు ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఈ విధంగా కాలువ నుంచి తీసిన పూడిక, వ్యర్థాలను కుప్పలుగా పోసి విడిచిపెట్టారు. దీంతో తీవ్ర దుర్గంధం వెలువడుతున్నది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఈ వ్యర్థాలు రోడ్లపైకి వచ్చేస్తోంది. ఫలితంగా పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొని అటుగా రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా శా నిటరీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ వేసిన వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హెచ్‌బీ కాలనీలో కాలువ నుంచి తీసి రోడ్డు పొడవునా కుప్పలుగా వేసిన పూడిక

యథేచ్ఛగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో డొమెస్టిక్ వంటగ్యాస్ వినియోగం



ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వినియోగిస్తున్న గృహావసర గ్యాస్ సిలిండర్

వెంకోజీపాలెం, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లను ప్రజలకు ఉచితంగా ఇచ్చి ఏం లాభం. గ్యాస్‌ను డెలివరీ చేసే బాయ్స్ పక్కదోవ పట్టి ఇంటికి వాడాల్సిన గ్యాస్ సిలిండర్‌లను బ్లాక్‌లో అధిక మొత్తానికి పాస్ట్ ఫుడ్ సెంటర్‌లకు, హోటళ్లకు విక్రయిస్తూ పబ్బం గడుపుతున్నారు. 19 కిలోల కమర్షియల్ సిలిండర్‌ను వాడాల్సిన వ్యాపారులు యథేచ్ఛగా 16.5 కేజీల వంట గ్యాస్ సిలిండర్లతో వ్యాపారాలను సాగిస్తున్నారు. ఒక పక్క ప్రభుత్వం ఉచిత గ్యాస్ గురించి, గ్యాస్ వినియోగంపై అవగాహనలు కల్పిస్తూ ఉంటే డెలివరీ బాయ్స్ దెబ్బకు ఇలా దుర్వినియోగం అవుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ 16వ వార్డులోని కృష్ణా కళాశాల సమీపంలోని వీఆర్డీ స్వీట్స్ అండ్ బేకరీ, శ్రీగణేష్ పాస్ట్‌ఫుడ్ సెంటర్‌ల వద్ద గృహావసరాల గ్యాస్ సిలిండర్లేకనిపిస్తున్నాయి. అనేక పుట్‌పాత్ వ్యాపారులు కూడా గృహావసరాల గ్యాస్ సిలిండర్లే వినియోగిస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

తల్లిదండ్రులు మందలించారని అక్కాచెల్లెలు అదృశ్యం

కూర్మన్నపాలెం, జూన్18(ఆంధ్ర జ్యోతి): నిత్యం ఇద్దరు కుమార్తెలు ఫోన్ చూస్తూ ఉండిపోతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని తల్లిదండ్రులు మందలించటంతో ఇద్దరు కుమార్తెలు ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి.. దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డులో నివాసముంటున్న షేక్ నాగూర్‌కు ఇద్దరు కుమార్తెలు షేక్ షర్మిళ (20), షేక్ నబీదాబేగమ్ (17). వీరు నిత్యం మొబైల్ చూస్తున్నారని ఈ నెల 11వ తేదిన తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి బయకు వెళ్లిపోయారు. ఐదు రోజుల పాటు పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెతికిన ఫలితం లేకపోవటంతో దువ్వాడ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు, రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలిక అదనపు కోచ్‌లు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంటూరు-రాయగడ-గుంటూరు మధ్య రాకపోకలు సాగించే 17243, 17244 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 18, 19 తేదీల్లో అదనంగా ఒక థర్డ్ ఏసీ కోచ్ జత చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

సినిమా గైడ్

- **డ్రాగన్ 3డి** : జగదాంబ
- **బల్లెరినా** : రమాదేవి
- **గేంబ్లర్స్** : శారద
- **థగ్ లైఫ్** : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- **భైరవం**: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- **సింగిల్** : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 20, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 60 , కీర దోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్ద ది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180

ఆర్టీసీ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి
- లంకెలపాలెం-ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్ బస్సు సర్వీసు ప్రారంభించిన అమాత్యుడు



లంకెలపాలెం-ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్‌కు బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోను గురువారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి ప్రయాణికులు, కార్మికులు రెండు కళ్లు వంటివారన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతుందన్నారు. సిబ్బంది, సంస్థ మనుగడే ధ్యేయంగా కార్మికులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. సీఎం చంద్రబాబు, పీఎం మోదీతో మాట్లాడి ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంటు కొనసాగేలా చూస్తానని పేర్కొన్నారు. స్టీల్ సిటీ డిపోకు కేటాయించిన స్థలం లీజు పూర్తయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడి డిపోలో ప్రస్తుతం 70 బస్సులు ఉన్నాయని, వీటిని వందకు పెంచుతామన్నారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను మంత్రి నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు.

బస్సు ప్రారంభం

లంకెలపాలె నుంచి ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్‌కు నూతన బస్సును రాంప్రసాద్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ కేఏస్ బ్రహ్మానందరెడ్డి, ఆర్‌ఎం బి.అప్పలనాయుడు, డిపో మేనేజర్ గౌతం చటర్జీ, ఏడీఎం పి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏడీసీ, మేనేజర్ అశ్విని పాల్గొన్నారు.

విద్యాకిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న గోవింద్, పాల్గొన్న ఉపాధ్యాయులు

ఆరిలోవ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని జీవీఎంసీ 9వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి బుడుమూరు గోవింద్ అన్నారు. బుధవారం పెదగదిలి మండల ప్రాథమిక పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన, వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే పథకాలు, సదుపాయాలను సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలన్నారు. 'తల్లికి వందనం' డబ్బులు ఇంకా ఎవరికైనా వారి అకౌంట్‌లో పడకుంటే వారు సంబంధిత సచివాలయానికి వెళ్లి సంప్రదించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా డేకు విదేశీ విద్యార్థులు సన్నద్ధం

- ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్న ఏయూ యోగా విభాగం



యోగాసనాలు సాధన చేస్తున్న ఏయూ విదేశీ విద్యార్థులు

సిరిపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) :అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థులు సిద్ధమవుతున్నారు. గత కొన్ని రోజులుగా విదేశీ విద్యార్థులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగవిభాగం పరిశోధకులు, పీజీ విద్యార్థులు ప్రత్యేకంగా శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ 21న బీచ్‌రోడ్డులో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటారు. ఏయూ తరపున సుమారు 200 మంది విదేశీ విద్యార్థులు హాజరవుతారు. వీరికి యోగా విధానం, యోగా కామన్ ప్రోటోకాల్‌పై అవగాహన కల్పించారు.

యోగాంధ్రలో ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొనాలి



ఏయూలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ధనుంజయ రావు, యోగా విభాగాధిపతి కె.రమేష్‌బాబు, ఏయూ ఉద్యోగులు

సిరిపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం, యోగాంధ్ర కార్యక్రమాల్లో ఏయూ ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొనాలని వర్సిటీ అధికారులు పేర్కొన్నారు. బుధవారం యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న వారంతా తమకు కేటాయించిన ప్రాంతంలో యోగా సాధనకు హాజరు కావాలన్నారు. ఉద్యోగులు ఇటువంటి కార్యక్రమాలకు ప్రచారం నిర్వహించడం, ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఎంతో మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, యోగా విభాగాధిపతి కె.రమేష్‌బాబు, ఉద్యోగులు తిరుపతిరావు, అమరేంద్ర, నూకరాజు, దేవుడు, బాలరాం, యాసిన్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' చర్చలు మళ్లీ వాయిదా

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘాల మధ్య రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) సమక్షంలో బుధవారం జరిగిన చర్చలు మళ్లీ వాయిదా పడ్డాయి. కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టి, నిలిపివేసిన సంగతి తెలిసందే. ఈ మధ్యలో రెండుసార్లు చర్చలు జరిగినా ఆ సమావేశాలకు ఉక్కు యాజమాన్య ప్రతినిధులు హాజరు కాలేదు. తాజాగా బుధవారం జరిగిన చర్చల్లో కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఎవరినీ తొలగించరాదని కోరారు. అయితే దీనిపై యాజమాన్య ప్రతినిధులు ఎటువంటి హామీ ఇవ్వలేదని నాయకులు పేర్కొన్నారు కాగా సంస్థకు చెందిన కాంట్రాక్టర్లు హాజరు కాకపోవడంతో ఈ చర్చలను ఈ నెల 26వ తేదికి వాయిదా వేసినట్టు వారు తెలిపారు.

యోగాంధ్ర నిర్వహణకు విస్తృత సన్నాహాలు

» 'ఉత్తర'లో సమన్వయపరిచిన మున్సిపల్ మంత్రి నారాయణ » రైల్వే క్రికెట్ మైదానం సిద్ధం » అంతటా కొనసాగుతున్న ఆసనాల సాధన » విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు



తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, చిత్రంలో మంత్రి నారాయణ, పత్తిపాటి పుల్లారావు తదితరులు

సీతమ్మధార, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమ సన్నాహాలు పరిశీలించేందుకు ఎమ్మెల్యే కార్యాలయానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, పత్తిపాటు పుల్లారావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, నజీర్, ఉషాకిరణ్, సురేష్ బాబు, జోనల్ కమిషనర్లు రాము, శివప్రసాద్ తదితరులు విచ్చేశారు. నిర్వహణ ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అందరినీ సమన్వయపరిచారు.

మురళీనగర్‌లో యోగాంధ్రపై అవగాహన

మాధవధార, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వైశాఖీస్పోర్ట్సు పార్కు సమావేశ మందిరంలో బుధవారం యోగాంధ్ర పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. మనదైన వారసత్వంగా యోగా ప్రపంచానికి పరిచయమైందన్నారు. మందులు, ఆసుపత్రి చికిత్సల పనిలేకుండా మన నేలపై పుట్టిన యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో ఆరోగ్య సాధనకు అలవాటుగా చేసుకోవాలని సూచించారు. విశాఖలో 21న జరగనున్న యోగోత్సవ కార్యక్రమానికి అంతా హాజరుకావాలన్నారు. టీడీపీ, జనసేన నాయకులు ఎస్.వరప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. కాలనీల నుంచి మహిళలు, స్థానికులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆసనాల సాధన

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే క్రికెట్ మైదానంలో భారీ సంఖ్యలో యోగాసనాల ప్రదర్శనకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. డివిజన్ వ్యాప్తంగా నాలుగు రోజుల నుంచి ప్రారంభించిన యోగా సాధన కొనసాగుతోంది. యోగాసనాల నిపుణుల శిక్షణ, పర్యవేక్షణలో వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం, అరకు, రాయగడ, కొరాపుట్, జగదల్‌పూర్ రైల్వే స్టేషన్ల ఆవరణలలో బుధవారం జరిగిన యోగా సాధనలో ఉద్యోగులు, సిబ్బంది, స్కౌట్ అండ్ గైడ్స్, సివిల్ డిఫెన్స్ వాలంటీర్లు పాల్గొని సాధన చేశారు. ఈ నెల 21న ఉదయం వాల్తేరు రైల్వే క్రికెట్ మైదానంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొని ఆసనాలు ప్రదర్శించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ చిన్నతనం నుంచే యోగా సాధన అలవాటు చేయాలన్నారు. ఆసనాల ద్వారా మానసిక, శారీరక సమతుల్యం పొందడంతో పాటు ఆందోళన, ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునని పేర్కొన్నారు. శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచి సానుకూల దృక్పథాన్ని పెంచే యోగా సాధనను రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొని యోగా సనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

అల్లిపురం: నగరంలో జరగనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకుడు, 32 వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం వార్డు కార్యాలయంలో ఆర్పీలు, వార్డు కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలతో సమన్వయం చేసుకొని యోగాంధ్రను జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు.

వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహాల్లో భాగంగా వాల్తేరు రైల్వే బుధవారం వివిధ పోటీలు నిర్వహించింది. ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక పాఠశాలల విద్యార్థులకు పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించింది. సుమారు వంద మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగా ప్రయోజనాలను వివరించే డ్రాయింగ్‌లను ప్రదర్శించారు. డివిజన్ వ్యాప్తంగా రైల్వే ఉద్యోగులకు వ్యాసరచన పోటీలు నిర్వహించింది. యోగా సాధన-ప్రయోజనాలు, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత-ఆధ్యాత్మిక పునరుద్ధరణ వంటి అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగాపై రైల్వే కాలనీలలో సిబ్బంది, స్కౌట్ అండ్ గైడ్స్ అవగాహన కల్పించారు.



వాల్తేరు రైల్వేవారు నిర్వహించిన పోటీల్లో డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతానికి జగన్ యత్నం

» హోం మంత్రి వంగలపూడి అనిత

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతానికి వైసీపీ అధినేత జగన్ ప్రయత్నిస్తున్నారని హోం మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. విశాఖ బీచ్ రోడ్డులో ఈ నెల 21న చేపట్టనున్న యోగాంధ్ర ఏర్పాట్లను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నేరస్థుడు రాజకీయ నాయకుడైతే ఎలా ఉంటుందో జగన్‌ను చూస్తే అర్థమవుతుందన్నారు. ఏడాదిలో జగన్ పరామర్శలకు వెళ్లడమే అజెండాగా చేసుకున్నారని ఎద్దేవా చేశారు. జగన్ పర్యటనల్లో రెచ్చగొట్టే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. బెట్టింగ్‌ల్లో డబ్బు పోగొట్టుకుని నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుంటే దానిని పోలీసులపైకి నెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. గత ఏడాది జూన్‌లో నాగమల్లేశ్వరరావు మృతిచెందితే...ఇప్పుడు ఆ కుటుంబాన్ని పరామర్శించడం జగన్ శవ రాజకీయాలకు పరాకాష్ఠ అన్నారు. తాజాగా బుధవారం జగన్ కాన్వాయ్ ఢీకొని వైసీపీ కార్యకర్త చనిపోతే కనీసం స్పందించలేదని, చివరికి పోలీసులు ఆస్పత్రికి తరలించారన్నారు. రాజకీయం ముసుగులో జగన్ కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. అంతర్జాతీయ యోగా వేడుకల నేపథ్యంలో రాష్ట్రంలో అలజడి సృష్టించాలని జగన్ చూస్తున్నారని విమర్శించారు. జగన్‌లాంటి వ్యక్తి సమాజంలో ఉండడానికి వీలు లేదన్నారు. సినిమా చూపిస్తాం.. తాట తీస్తామనడం వంటి దిగజారుడు మాటలు ఆ పార్టీ నేతల దివాళాకోరుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

యోగా సన్నాహాల కోసం నేడు వాక్‌థాన్

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా వేడుకల సన్నాహాల్లో భాగంగా విస్తృత ప్రచారం కోసం గురువారం ఉదయం ఆరుగంటలకు ఏయూ కన్వెన్షన్ హాలు నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకు వాక్‌థాన్ నిర్వహిస్తున్నారు. అనంతరం అధికారులు, శిక్షకులు, ప్రజలు యోగాసనాలు వేస్తారని కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున వాక్‌థాన్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు: విజయనగరం ఎస్పీ వకుళ్

సాగర్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. బుధవారం ఆయన రుషికొండ ఏ-1 ఫంక్షన్‌లో హాల్‌లో బందోబస్తు, భద్రతా విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఐటీ సెజ్ నుంచి కాపులుప్పాడ వరకు ఏర్పాటు చేసిన 59 కంపార్టుమెంట్లలో విస్తృత స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలనిసూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

ఎన్‌కౌంటర్‌తో కలకలం

(5వ పేజీ తరువాయి)

ఆజాద్ యాక్షన్ టీమ్ సభ్యునిగా ఉంటూ 2016లో కొయ్యూరు మండలం మర్రిపాకలు వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. మరో కుమార్తె ఝాన్సీ న్యాయవాది. ఆమె భర్తతో పాటు కరకవానిపాలెంలో ఉంటున్నారు. గతంలో కుమారుడు, ఇప్పుడు కుమార్తె ఎన్‌కౌంటర్‌లో మృతిచెందడంతో ఆ కుటుంబం విషాదంలో ఉంది.

విశాఖ విమల విద్యాలయాల మూత

(5వ పేజీ తరువాయి)

ఎటువంటి ప్రయత్నం చేయలేదు. దాంతో స్టీల్ యాజమాన్యం ఇప్పుడు డబ్బులు ఇవ్వలేమని చాలా స్పష్టంగా చెప్పింది.

స్కూల్‌ను యథావిధిగా నడపాలి

స్టీల్‌ప్లాంటు యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తును దృష్టితో పెట్టుకొని స్కూల్‌ను యథావిధిగా నడపాలి. పేద పిల్లలు చదువుకునే స్కూల్‌కు యాజమాన్యం అండగా నిలవాలి. స్కూల్ ఆపేయడం వల్ల ఇటు విద్యార్థులు, అటు ఎన్నో ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని, తక్షణమే స్కూల్ తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలి.

- బి.గంగారాం, 78వ వార్డు కార్పొరేటర్

యోగాకు ముమ్మర ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

అమర్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ సహా 175 దేశాల ప్రతినిధులు యోగా కార్యక్రమంలో పాల్గొంటారని బుధవారం ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ప్రకటించారు. ఈ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఎస్పీజీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఆ ప్రాంతం పోలీసుల ఆధీనంలో ఉంది. ఆర్కే బీచ్‌రోడ్డుకు ప్రత్యామ్నాయంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 25 వేల మంది పాల్గొనేలా మరో వేదిక నిర్మించారు. ఇక్కడ కూడా వర్షం పడినా ఇబ్బందిలేకుండా జర్మన్ హ్యాంగర్స్‌తో వాటర్‌ప్రూఫ్ రేకులతో భారీ హాళ్లు ఏర్పాటుచేశారు. సుమారు 25 వేల మంది గిరిజన యువతీయువకులు యోగాతో పాటు సూర్య నమస్కారాలు చేయనున్నారు. కాగా యోగా దినోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం సాయంత్రం హోం మంత్రి వంగలపూడి అనిత సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు వినియోగించాలని ఆదేశించారు. ట్రాఫిక్ మళ్లింపు నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు అనగాని సత్యప్రసాద్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, బీసీ జనార్దనరెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, ఇతర ప్రజా ప్రతినిధులు నియోజకవర్గాల్లో సమీక్షలు నిర్వహించి, జన సమీకరణ, రవాణా సదుపాయాలపై సూచనలు చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి జనాల తరలింపునకు టార్గెట్లు ఇచ్చారు. ఇదిలావుండగా యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన కూడళ్లతో పాటు ఆర్కే బీచ్‌రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఉక్కులో దిద్దుబాటు

(5వ పేజీ తరువాయి)

వేగంగా పూర్తి చేయడానికి మెకానికల్, ఎలక్ట్రికల్, సేఫ్టీ ప్రాజెక్ట్ విభాగాల ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని వేసింది. వారిని సమన్వయం చేసే బాధ్యతలను వర్క్స్ చీఫ్ జనరల్ మేనేజర్‌కు అప్పగించింది. కమిటీ నియామకంపై ఉద్యోగ వర్గాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. తాము ఈ పనులు చేయాలనే మొత్తుకుంటున్నామని, ఎవరు చేసినా తమకు అభ్యంతరం లేదని, ప్రమాదాలకు ఆస్కారం లేని పని వాతావరణం కల్పించాలనేదే తమ డిమాండ్ అని పేర్కొన్నాయి.

హైవేపై ట్రాఫిక్ జామ్

(5వ పేజీ తరువాయి)

సమయం పట్టింది. ముఖ్యంగా విశాఖ వేలీ స్కూల్ జంక్షన్ నుంచి మద్దిలపాలెం రావడానికి గంటన్నర పట్టింది. ఉదయం 10 గంటలకు మొదలైన ఈ సమస్య రాత్రి 10 గంటల వరకూ కొనసాగింది. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయినవారు చాలా ఇబ్బందిపడ్డారు. పోలీసులంతా బీచ్‌రోడ్డుకే పరిమితం కావడం, ట్రాఫిక్ క్లియర్ చేయడానికి అదనపు సిబ్బందిని నియమించకపోవడం వల్ల సమస్యకు కారణంగా చెప్పవచ్చు. ఇప్పుడే ఇలా ఉంటే..శుక్ర, శనివారాల్లో ట్రాఫిక్ పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.

డ్రోన్లు ఉపయోగించండి : హోం మంత్రి

జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయిన విషయం హోం మంత్రి అనిత దృష్టికి వెళ్లడంతో ఆమె కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధాన జంక్షన్లలో ట్రాఫిక్‌ను సీసీ టీవీ కెమెరాల ద్వారా పరిశీలిస్తూ వాటిని క్లియర్ చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి ఎక్కడ సమస్య ఉందో తెలుసుకొని క్లియర్ చేయాలని సూచించారు.

ఏకోపాధ్యాయులకు నిరాశ

(5వ పేజీ తరువాయి)

ఏకోపాధ్యాయ పాఠశాల్లో నియమిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని విశాఖ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. అప్పటివరకూ ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారో అక్కడే పనిచేయాల్సిందిగా చెప్పడంతో ఏకోపాధ్యాయులంతా నిరాశ చెందారు. ప్రస్తుతం డీఎస్సీ రాత పరీక్షలు నెలాఖరు వరకు జరుగుతాయి. తరువాత ఫలితాలు విడుదల చేసి నియామక షెడ్యూల్ ఖరారుకు రెండు, మూడు నెలలు పడుతుందని ఉపాధ్యాయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

4,903 మంది టీచర్లకు బదిలీలు

ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీలలో 4,903 మంది టీచర్లకు బదిలీలు అయ్యాయి. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, లాంగ్వేజ్ పండిట్ల బదిలీలు ఆన్‌లైన్‌లో చేపట్టారు. సెకండరీగ్రేడ్ టీచర్లు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లకు మాత్రం మాన్యువల్‌గా బదిలీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-2 హెచ్ఎంలు 89 మంది, మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు 177, స్కూల్ అసిస్టెంట్ తత్సమాన హోదా టీచర్లు 2,305 మంది, ఎస్జీటీలు 2,229 మంది, లాంగ్వేజ్ పండిట్లు 78 మంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు 10 మంది, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు 15 మందికి బదిలీ అయింది.

153 మంది టీచర్లకు పదోన్నతి

ఉమ్మడి జిల్లాలో వివిధ కేటగిరీలలో 153 మంది టీచర్లకు పదోన్నతి కల్పించారు. గ్రేడ్-2 హెచ్ఎంలుగా 72 మంది, మోడల్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా 36 మంది, స్కూలు అసిస్టెంట్ కేటగిరీలో ఇంగ్లీష్‌లో ఒకటి, హిందీ, తెలుగులో రెండేసి, బయాలజీలో 16, గణితంలో మూడు, సోషల్ స్టడీస్‌లో 9, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 12 మందికి పదోన్నతి వచ్చింది.

వాలీబాల్ క్రీడాకారుడు మౌర్యకు అభినందన



తల్లిదండ్రులతో ఉన్న మౌర్యను అభినందిస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వాలీబాల్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మౌర్య నందమూడిని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. ఉజ్బెకిస్తాన్‌లో జరిగిన సెంట్రల్ ఏషియన్ వాలీబాల్ అసోసియేషన్ (కావా) అండర్-19 పురుషుల ఇంటర్నేషనల్ వాలీబాల్ లీగ్ చాంపియన్‌షిప్-2025 టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమన్నారు. యువ వాలీబాల్ క్రీడాకారుడు మౌర్య తండ్రి శ్యామ్, పోర్టు అథారిటీ ఉద్యోగి కావడమే కాకుండా ఉన్నత స్థాయి క్రికెటర్‌గా సంస్థకు సేవలందించడం గర్వకారణమని పేర్కొన్నారు. పోర్టు అథారిటీ కార్యదర్శి టి.వేణు గోపాల్ మాట్లాడుతూ క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదలతో సాధన చేసి భవిష్యత్తులో భారత వాలీబాల్ జట్టులో సుస్థిర స్థానం సాధించి దేశానికి పతకాలు అందించాలని ఆకాంక్షించారు. పోర్టు అధికారులు పలువురు మౌర్యను అభినందించారు.

'ఉక్కు' చర్చలు మళ్లీ వాయిదా

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కాంట్రాక్టు కార్మిక సంఘాల మధ్య రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో బుధవారం జరిగిన చర్చలు మళ్లీ వాయిదా పడ్డాయి. కాంట్రాక్టు కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టి, నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ మధ్యలో రెండుసార్లు చర్చలు జరిగినా ఆ సమావేశాలకు ఉక్కు యాజమాన్య ప్రతినిధులు హాజరు కాలేదు. తాజాగా బుధవారం జరిగిన చర్చల్లో కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, ఇకపై ఎవరినీ తొలగించరాదని కోరారు. అయితే దీనిపై యాజమాన్య ప్రతినిధులు ఎటువంటి హామీ ఇవ్వలేదని నాయకులు పేర్కొన్నారు కాగా సంస్థకు చెందిన కాంట్రాక్టర్లు హాజరు కాకపోవడంతో ఈ చర్చలను ఈ నెల 26వ తేదికి వాయిదా వేసినట్టు వారు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించడంతో అక్కాచెల్లెలు అదృశ్యం

కూర్మన్నపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఇద్దరు కుమార్తెలు ఫోన్ చూస్తూ ఉండిపోతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని తల్లిదండ్రులు మందలించటంతో ఇద్దరు కుమార్తెలు ఇంటి నుంచి అదృశ్యమైన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి...దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డులో నివాసముంటున్న షేక్ నాగూర్‌కు ఇద్దరు కుమార్తెలు షేక్ షర్మిళ (20), షేక్ నబీదాబేగమ్ (17). వీరు నిత్యం మొబైల్ చూస్తున్నారని ఈ నెల 11వ తేదిన తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి బయకు వెళ్లిపోయారు. ఐదు రోజుల పాటు పరిసర ప్రాంతాల్లో, బంధువుల ఇళ్ల వద్ద వెతికిన ఫలితం లేకపోవటంతో దువ్వాడ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పల్లా కుటుంబానికి మంత్రి సబిత పరామర్శ



పల్లా సింహాచలం చిత్రపటం వద్ద నమస్కరిస్తున్న మంత్రి సబిత, చిత్రంలో గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు

సీతంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి బుధవారం విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత సీతంపేట రాజేంద్రనగర్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఇంటికి విచ్చేశారు. పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం ఇటీవల మృతిచెందడంతో ఆయన చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పల్లా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి తన సానుభూతి తెలిపారు. ఇదిలా ఉండగా పల్లా శ్రీనివాసరావు ఇంటికి పలువురు ఇతర నాయకులు కూడా వేర్వేరుగా విచ్చేసి పరామర్శించారు. సింహాచలం చిత్రపటం వద్ద పూలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక నాయకుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'అందని ద్రాక్షలా సంక్షేమ పథకాలు'

మురళీనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్ని వర్గాలకు సమానంగా సంక్షేమ పథకాలు అందాలన్నది ఏన్డీయే కూటమి ప్రభుత్వ ఆలోచన అని బీజేపీ నాయకుడు మూల వెంకటరావు అన్నారు.



మూల వెంకటరావు

అయితే కొన్ని నిబంధనల కారణంగా పేదవర్గాలకు సంక్షేమ పథకాలు సరిగా అందడం లేదని, దీనిపై సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టి సారించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం, గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ సబ్సిడీలు విశాఖ ఉత్తర నియోజకవర్గం సహా నగర వ్యాప్తంగా కొందరు పేదలు అందుకోలేకపోయారని అన్నారు. ప్రభుత్వం వీరిని ఆదుకోవాలన్నారు. నెలకు రూ.15 వేల జీతం మాత్రమే వచ్చే ఆప్కాస్ ఉద్యోగులు ఈ పథకాలు పొందలేకపోయారని అన్నారు. వేతన పరిమితిని రూ.25వేలకు పెంచి వీరిని అర్హులుగా ప్రకటించాలని వెంకటరావు సూచించారు. తల్లికి వందనం పథకంలోనూ పేద వర్గాలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలే పేదలకు కొండంత అండగా నిలుస్తున్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని వెంకటరావు కోరారు.

ప్రతిభావంత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్పులు అందుకున్న విద్యార్థులతో దక్షిణ ఎమెల్యే వంశీకృష్ణ

అల్లిపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 33వ వార్డు జీవీఎంసీ మహాత్మాగాంధీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్పులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దక్షిణ నియోజకవర్గం ఎమెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విచ్చేశారు. 538, 532 మార్కులు సాధించిన దీపిక, జి.ఎర్రమ్మలకు రూ.10 వేలు వంతున, 523 మార్కులు వచ్చిన ఒ.చాందినికి రూ.8 వేలు స్కాలర్‌షిప్‌లను జీకే ఫౌండేషన్ అధినేత గోపికృష్ణ, కార్పొరేటర్ బీశెట్టి వసంతలక్ష్మి సారథ్యంలో ఎమ్మెల్యే ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగభూషణం, జనసేన నాయకులు శివప్రసాద్ రెడ్డి, ఆకుల రాజు, టీడీపీ నాయకులు విల్లూరి చక్రవర్తి,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



పుషప్స్ తీస్తున్న విద్యార్థినులు

అక్కయ్యపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల మూడో బ్యాచ్ కోసం బుధవారం ఎంపిక కార్యక్రమం జరిగింది. 11ఎ జేడీ ట్రూప్ కమాండర్, పాఠశాల ఎన్‌సీసీ అధికారి ఎంవీ విశ్వనాథం నేతృత్వంలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో విద్యార్థులకు సుబేదార్ మేజర్ జయప్రకాశ్, హవల్దార్ శ్యామలరావు, హవల్దార్ శుక్రరాజ్‌లు పరుగు పందెం, పుషప్స్, శారీరక పరీక్షలు నిర్వహించి అందులో విజయం సాధించిన 26 మందిని ఎంపిక చేశారు. వీరందరినీ ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి, ఆంధ్ర బెటాలియన్ కమాండర్ కల్నల్ అజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

ఈ రహదారులపై రాకపోకలకు గుబులే!

» 31వ వార్డులో రాళ్లుతేలిన మార్గం » ఎల్ఐసీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు గోతులే » రాత్రి వేళ వాహనదారులకు ప్రమాదాలు

డాబాగార్డెన్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పలు ప్రాంతాల్లో రహదారులపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు, ప్రయాణికులు హడలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వార్డులోని జైల్‌రోడ్డు, కృష్ణాగార్డెన్స్, లలితాకాలనీలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఎల్ఐసీ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో సమస్య మరింత జటిలంగా తయారైంది. పెద్ద బస్సులతో పాటు నిత్యం వేలాది వాహనాలు ఈ సర్కిల్ చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో కొన్ని వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించాలంటే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సరిగ్గా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లే మార్గమే కాకుండా నిత్యం వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారు సైతం ఈ రహదారులను చూసి అవాక్కవుతున్నారు. సంబంధిత అధికారులు గోతులు నిండిన రహదారులకు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు.సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణమే రహదారులపై మరమ్మతులు చేపట్టకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు పాదచారులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో గోతుల రహదారి

దారుణ స్థితిలో రహదారి

ఆర్టీసీ కాంప్లెక్స్ టీఎస్సార్ వాటర్ టాంక్ వద్ద రోడ్డు దారుణంగా ఉంది.ఇక్కడ వచ్చే సమయంలోని ఒక్కసారిగా గోతుల్లో పడిన వాహనాలపై కిందకు పడి ప్రమాదాలకు గురవుతున్నారు.అసలు ముఖ్యమైన కూడళ్లను రహదారులు దెబ్బతిన్న ఎందుకు పట్టించుకోవడం లేదు.

-వై.సురేష్‌బాబు, డాబాగార్డెన్స్

తక్షణమే మరమ్మతు చేపట్టండి

కృష్ణాగార్డెన్స్ నుంచి జైల్‌రోడ్డుమీదుగా అంబేడ్కర్ సర్కిల్‌కు వెళ్లే రహదారిలో పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. వేగంగా వచ్చే వాహనాలు, మలుపు తిరిగేటప్పుడు కొందరు వాహనదారులు ఒకరి వెనుక మరొకరు వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన రహదారికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

-ఎల్.నీలవేణి, కృష్ణాగార్డెన్స్

ఏఎన్‌ఎంలను సొంత మండలాలకు బదిలీ చేయాలి

పెదగంట్యాడ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు/ఏఎన్‌ఎంలను సొంత మండలాలకు బదిలీ చేయాలని కోరుతూ వారు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది మే 31 నాటికి ఒకేచోట ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న సచివాలయ ఉద్యోగులకు బదిలీ అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అయితే ఉద్యోగి జన్మించిన మండలంలో పోస్టింగ్ ఇవ్వబోమని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి తమను సొంత మండలాలకు బదిలీ చేసేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

85వ వార్డు వైసీపీ అధ్యక్షుడిగా పూర్ణానందశర్మ



అగనంపూడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ 85వ వార్డు అధ్యక్షుడిగా జి.పూర్ణానందశర్మను నియమిస్తూ బుధవారం పార్టీ జిల్లా అధిష్టానం ఉత్తర్వులు విడుదల చేసింది. తనపై నమ్మకం ఉంచి వార్డు అధ్యక్షుడి బాధ్యతలను అప్పగించిన పార్టీ అధినేత జగన్, ఎమ్మెల్సీలు బొత్స సత్యనారాయణ, వరుదు కల్యాణి, మాజీ మంత్రి అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నేతలు కేకే రాజు, దేవన్‌రెడ్డిలకు పూర్ణానందశర్మ కృతజ్ఞతలు తెలిపారు.

అగనంపూడి ప్రాంత సమస్యలపై మంత్రికి వినతి

అగనంపూడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ప్రాంత సమస్యలపై రాష్ట్ర రవాణాశాఖ, యువజన, క్రీడా శాఖ మంత్రి రాంప్రసాదరెడ్డికి స్థానిక టీడీపీ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. స్థానికంగా గల హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో స్థానికులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. గాజువాక నుంచి లంకెలపాలెం, అగనంపూడి, మంగళపాలెం మీదుగా దువ్వాడ రైల్వే స్టేషన్ వరకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి కోరారు. వీటిపై మంతి సానుకూలంగా స్పందించినట్టు నాయకులు తెలిపారు. మంత్రిని కలిసి వారిలో నాయకులు బి.సత్యనారాయణ, బండారు చందూరమేశ్, తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేసే అధికారులకు గుర్తింపు

అక్కిరెడ్డిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సంస్థ అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేసే అధికారులకు తప్పనిసరిగా మంచి గుర్తింపు లభిస్తుందని గెయిల్ జనరల్ మేనేజర్ ఎంవీఎస్ మూర్తి అన్నారు. షీలానగర్ వద్ద గల గెయిల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్.ఈశ్వరరావును అధికారులతో పాటు ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవలతో ఎవరికైనా గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అధికారులు పి.స్టీఫెన్, కె.గంగాధరరావు, సంతోశ్‌కుమార్, ఉద్యోగులు ఎం.హుస్సేన్, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- ● డ్రాగన్ 3డి : జగదాంబ
- ● బల్లెరినా : రమాదేవి
- ● గేంబ్లర్స్ : శారద
- ● థగ్ లైఫ్ : మెలోడి, సంగం, కామేశ్వరి, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం) అరుణ (పెదగంట్యాడ)
- ● భైరవం: శ్రీకన్య, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక)
- ● సింగిల్ : గోకుల్, మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- ● శుభం: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 20, వంకాయలు (తెలుపు) 38, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 24, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 20, క్యారెట్ 38 దొండకాయలు 20, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)52, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 70, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 60 , కీరదోస 30, కాప్సికమ్ 70, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడ దుంపలు 30, కంద 56, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



జెండా ఊపి లంకెలపాలెం-ఐటీ హిల్స్ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి

ఆర్టీసీ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి
- లంకెలపాలెం నుంచి ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్‌కు బస్సు ప్రారంభం

కూర్మన్నపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోను గురువారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీకి ప్రయాణికులు, కార్మికులు రెండు కళ్లు వంటి వారన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతుందన్నారు. సిబ్బంది, సంస్థ మనుగడే ధ్యేయంగా కార్మికులందరూ బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. సీఎం చంద్రబాబు, పీఎం మోదీతో మాట్లాడి ప్రభుత్వ రంగంలోనే స్టీల్ ప్లాంట్ కొనసాగేలా చూస్తానని పేర్కొన్నారు. స్టీల్ సిటీ డిపోకు కేటాయించిన స్థలం లీజు పూర్తయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడి డిపోలో ప్రస్తుతం 70 బస్సులు ఉన్నాయని, వీటిని వందకు పెంచుతామన్నారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను మంత్రి నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు.

బస్సు ప్రారంభం

లంకెలపాలె నుంచి ఇన్ఫోసిస్ ఐటీ హిల్స్‌కు నూతన బస్సును రాంప్రసాద్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోన్ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి, ఆర్ఎం బి.అప్పలనాయుడు, డిపో మేనేజర్ గౌతం ఛటర్జీ, ఏడీఎం పి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఏడీసీ, మేనేజర్ అశ్వని, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెంపు

అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెంపునకు, శారీరక దృఢత్వానికి యోగా ఎంతో దోహదపడుతుందని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నగరంలో నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక కార్యక్రమంలో భాగంగా బుధవారం అక్కిరెడ్డిపాలెం పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రముఖ యోగా శిక్షకులు వాసు యోగా ఆవశ్యకతను విద్యార్థులకు వివ రించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇస్మాయిల్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: నిరంతరం యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కణితి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశ్ అన్నారు. 87వ వార్డు పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం సుమారు తొమ్మిది వందల మంది విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ నెల 21న నగరంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజున పాఠశాలలో వెయ్యి మంది విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తామని హెచ్‌ఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణరావు, నరసింగరావు,షేక్ ప్రసాద్, కౌసల్య, అరుణ, శంకరరావు, శ్రీనివాస్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.





కణితి జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు. (ఇన్‌సెట్లో) అక్కిరెడ్డిపాలెం హై స్కూల్‌లో ఆసనాలు వేస్తున్న దృశ్యం

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి: కార్పొరేటర్

పెదగంట్యాడ,: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న నగరంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడుకోరారు. వికాస్ నగర్ రాజీవ్ స్టేడియం కార్యాలయంలో నిర్వహించిన వార్డు రిసోర్స్ పర్సన్లు, స్థానిక నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. యువతీ యువకులను యోగాంధ్ర పట్ల అవగాహన కల్పించి, క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. అలాగే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు యోగాంధ్ర ఆవశ్యకతను వివరించాలని పేర్కొన్నారు.

యావత్ దేశం చూపు నగరం వైపే : దేవినేని ఉమా

పెందుర్తి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గిన్నిస్ రికార్డే లక్ష్యంగా యోగాంధ్ర నిర్వహణతో దేశం మొత్తం విశాఖ వైపే చూస్తోందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. యోగా దినోత్సవాన్ని ఆంధ్రాలో నిర్వహించాలని ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు కోరారని చెప్పారు. ఇది ప్రజల కార్యక్రమని దీనిని జయప్రదం చేయాలని కోరారు. యోగాంధ్ర నిర్వహరణ పై పెందుర్తి నియోజకవర్గంలో అధికారులు, కూటమి నాయకులతో బుధవారం స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల ఆధ్వర్యంలో సుజాతనగర్ దాట్ల కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గ యోగాంధ్ర సమన్వయకర్త దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రణాళికబద్ధంగా పని చేయాలని ప్రజలతో కలసికట్టుగా యోగాంధ్రను విజయవంతం చేయాలని సూచించారు. రాజకీయాలకు 5 లక్షల మందితో నిర్వహించనున్న యోగాంధ్ర గిన్నిస్ రికార్డు సాధించడం అందరి బాధ్యత అని అన్నారు. పెందుర్తి నియోజకవర్గం నుంచి కనీసం 50 వేల మంది కార్యక్రమానికి తరలిరావాలని అన్నారు. ఇన్‌చార్జి మంత్రి డోలా వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని అన్నారు. పంచకర్ల మాట్లాడుతూ 21న వేకువజామునే కంపార్టుమెంట్లకు గంట ముందే చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పించామని, నగరం సాధించే ఘనత ప్రపంచం చూడబోతోందని అన్నారు. విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ యోగాంధ్రాను ఒక యజ్ఞంలా భావించి జీవీఎంసీ 98 వార్డుల్లో ప్రజలు కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. గండి బాబ్జీ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమం కచ్చితంగా గిన్నిస్ రికార్డు సాధిస్తుందని, అధిక ప్రజలు పాల్గొనేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. అంతకముందు దేవినేని, ఎమ్మెల్యే పంచకర్ల, గండి బాబ్జీ, మేయర్ పీలా, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు అధికారులు యోగాంధ్ర నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యోగాంధ్ర ప్రత్యేకాధికారి తేజభరత్, జెడ్సీలు హేమావతి, శేషాద్రి, కార్పొరేటర్లు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరావు

'యోగాంధ్రను జయప్రదం చేయాలి'

గోపాలపట్నం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో 21న నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం నియోజకవర్గ కార్యాలయంలో కూటమి శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాటాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని చేపట్టారని పేర్కొన్నారు. నియోజకవర్గం నుంచి 30 వేల మంది ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడానికి నియోజకవర్గం నుంచి జరిగే ఏర్పాట్లుపై మంత్రి పి. నారాయణ ఎమ్మెల్యే గణబాబు నివాసంలో బుధవారం సాయంత్రం చర్చించారు. వార్డు నాయకులు, అధికారుల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం పెతకంశెట్టి అప్పలనరసింహం విగ్రహానికి నివాళులు అర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి. గణబాబు

ఉత్సాహంగా యోగా సాధన



యోగా సాధన చేస్తున్న మహిళలు

వేపగుంట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 98వ వార్డులో గోపీజనవల్లభ ఆలయంలో యోగా శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ట్రైనర్ లక్ష్మి ఉదయం, సాయంత్రం యోగా శిక్షణ తరగతు లను నిర్వహిస్తున్నన్నట్లు యూసీడీ అధికారులు తెలియజేశారు. ఈ ఉచిత యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

కార్మిక కుటుంబానికి విరాళం అందజేత

మల్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): షిప్‌యార్డు మాజీ సొసైటీ కార్మికుడు బీశెట్టి శ్రీనివాసరావు ఇటీవల మృతిచెందడంతో అతని కుటుంబానికి మాజీ సొసైటీ కార్మికులు ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ శ్రీనివాసు కుటుంబానికి తమ వంతు సహకారంగా కార్మికులందరు కలిపి రూ.1, 75, 953 చెక్కురూపంలో అందజేశామని తెలిపారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

పెందుర్తి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ తనిఖీ కార్యక్రమం లో భాగంగా ఉపాధి పనులకు ఖర్చు రూ. 5,73,14,689 చేయగా కూలీలకు 3,51,92,119 వేతన రూపంలో చెల్లించారని తేలింది. పని ప్రదేశంలో తనిఖీలు నిర్వహించంగా పనుల్లో భాగంగా కొన్ని తప్పిదాలు జరిగాయని తెలిపారు. సరిపల్లి, జంగాలిపాలెం, గుర్రమ్మపాలెం మరికొన్ని గ్రామాల్లో రూ. 6వేలు రికవరీ చేసినట్టు అధికారులు తెలిపారు.

బాక్సింగ్ కిట్ల పంపిణీ



బాక్సర్లతో చిరంజీవిరెడ్డి, తదితరులు

సింధియా. జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేబీసీ బాక్సింగ్ క్లబ్ క్రీడకారులను ప్రోత్సహిస్తూ ఆర్మీ మాజీ హవాల్దార్ చిరంజీవిరెడ్డి బాక్సింగ్ కిట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా సింధియాలోని బాక్సింగ్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాక్సింగ్‌ను శ్రద్ధతో నేర్చుకుని, క్లబ్‌కు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. ఆటలో రాణిస్తే ఉద్యోగాలు పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమానికి జేబీసీ బాక్సింగ్ కోచ్, అంతర్జాతీయ బాక్సర్ గుర్రాల రామారావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



సీఎం చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మంది బాధితులకు రూ.6.80 లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అరుంధతి, వల్లభరావు

ఫైటెక్ సంస్థతో విజ్ఞాన్ ఎంవోయూ

అగనంపూడి, జూన్ 18 (ఆంధ్రజోతి)): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల నైపుణ్యాభివృద్ధి, విద్య, పరిశోధనల్లో పరస్పర సహకారం కోసం ఫైటెక్ ఎంబెడెడ్ ప్రైవేటు సంస్థతో ఎంవోయూ చేసుకుంది. ఈ మేరకు బుధవారం విజ్ఞాన్ ప్రిన్సిపాల్ అరుంధతి ఫైటెక్ సంస్థ ఎండీ వల్లభరావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు శిక్షణ, ఇంటర్న్‌షిప్ పరిశ్రమ ఆధారిత అనుభవం లభించాలనే ఉద్దేశంతో ఫైటెక్ సంస్థతో ఎంవోయూ చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు విజ్ఞాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

కూర్మన్నపాలెం,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ మ్యాజిక్ బస్సు సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కణితి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బి.సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రైవేటు స్కూళ్ల మోజులో పడి ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను తల్లిదండ్రులు చేర్పించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారెందరో ఉన్నత స్థానాలను అధిరోహించారన్నారు. అలాగే విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం నరసింగరావు, పీడీ నారాయణరావు, నాగమణి, శ్రీనివాస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా జీవీఎంసీ మైదానం

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాకర్లు



మల్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ వాకర్స్ మైదానం మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రయితే చాలు ఈ మైదానంలోకి మందుబాబులు చేరుకుని మద్యం సేవిస్తూ ఎక్కడపడితే అక్కడ ఖాళీ సీసాలను పడేస్తుండడంతో మైదానం అధ్వానంగా మారుతుండడంతో వాకర్స్ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డులకు సంబంధించి ఇదొక్కటే వాకర్స్ మైదానం కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో అనేక మంది ఇక్కడకు వస్తుంటారు. అధికారులు రూ.లక్షలు వెచ్చించి ఇక్కడి మైదానాన్ని అభివృద్ధి చేసిందని, అయితే మందుబాబుల పుణ్యమాని ఇది అధ్వానంగా మారుతుందని పలువురు వాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ వాకర్స్ కోసం నిర్మించిన బాత్‌రూమ్‌ల వద్ద పారిశుధ్యం క్షీణించడంతో ఇబ్బందికరంగా ఉంటుందని వారు వాపోతున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు స్పందించి మైదానం రక్షణకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సిలిండర్‌లో గ్యాస్ తగ్గడంతో 112కు ఫోన్



112కు ఫోన్ చేసిన వినియోగదారుడు

మల్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సిలిండర్‌లో తక్కువ గ్యాస్ రావడంతో ఓ వినియోగదారుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసి తన సమస్యను పరిష్క రించుకున్నాడు. ఈ విషయం తెలిసిన స్థానికులు ఔరా! అంటున్నారు. ఇటీవల ఓ గ్యాస్ ఏజెన్సీ నుంచి సదరు వినియోగదారుడు గ్యాస్ బుక్‌చేసుకున్నాడు. అయితే స్టౌవ్ వెలిగించే సమయంలో సిలిండర్‌లో తక్కువ గ్యాస్ ఉన్నదని గమనించి గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి తనకు జరిగిన నష్టం గురించి వివరిచాడు. ఏజెన్సీ యాజమాన్యం నుంచి సరైన స్పందన లేకపో వడంతో అతను పోలీస్ హెల్ప్‌లైన్ 112కు ఫోన్ చేసి తనకు జరిగిన అన్యాయం గురించి వివరి ంచాడు. దీంతో పోలీసులు గ్యాస్ ఏజెన్సీకి చేరుకుని, యాజమాన్యంతో మాట్లాడి వినియోగదారునికి ఇంకో గ్యాస్ సిలిండర్ ఇప్పించారు.

వెంకటాద్రి నగర్‌లో చురుగ్గా కల్వర్టు పనులు



కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

వేపగుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని వెంకటాద్రినగర్ పోస్టల్ కాలనీ శివారున గల గెడ్డలో చేపడుతున్న కల్వర్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.19.27 లక్షలతో చేపట్టిన దీని నిర్మాణం పూర్తయితే వెంకటాద్రినగర్ పోస్టల్ కాలనీ నుంచి 98వ వార్డు శ్రీలక్ష్మీనరసింహ నగర్, సిద్ధిలక్ష్మీనగర్‌కు కలిపేందుకు వీలుగా ఉంటుంది. కాగా సపోర్టింగ్ వాల్స్ నాణ్యతపై పలువురు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సపోర్టింగ్ వాల్స్‌ను ఒకవైపు మాత్రమే వేయడం, గెడ్డ పెద్దదిగా ఉన్నందున వర్షాకాలంలో ప్రమాదం వాటిల్లవచ్చని పేర్కొంటున్నారు. అందువల్ల అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇగ్నో ఆన్‌లైన్ అడ్మిషన్లు ప్రారంభం

ఎంవీపీ కాలనీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)-2025 విద్యా సంవత్సరానికి వివిధ దూర విద్యా కోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల చేసింది. అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో జూలై 15 వరకూ అడ్మిషన్లు ఆన్‌లైన్‌లో మాత్రమే కొనసాగుతాయని పేర్కొంది. ఫీజులు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని, ఎంపిక చేసిన డిగ్రీ కోర్సుల్లో ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఇ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు.

హస్తకళా పోటీలకు ఆహ్వానం

మహారాణిపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హ్యాండీక్రాఫ్ట్ హ్యాండ్లూమ్‌లలో కొత్త సావనీర్ డిజైన్ల సృష్టికి రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎం.విశ్వ తెలిపారు. జగదాంబ జంక్షన్ వద్ద గల లేపాక్షి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఏపీహెచ్‌డీసీ, ఏపీ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్సు కో-ఆపరేటివ్ సొసైటీ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో రాష్ట్రానికి చెందిన 18 సంవత్సరాల వయసు దాటిన కళాకారులు, చేనేత డిజైనర్లు పాల్గొనవచ్చన్నారు. న్యూమాటిక్ ఆటోమేటిక్ కొత్తడిజైన్లు రూపొందించడమే లక్ష్యమన్నారు. సృజనాత్మక హస్తకళల రూపకల్పన, సుస్థిరత ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రతివర్గంలో ముగ్గురు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. కొత్తగా తయారుచేసిన సావనీర్ నమూనాలను జూన్ 19 నుంచి జూలై 17 మధ్య లేపాక్షి షోరూమ్‌లో సమర్పించాలని, లేపాక్షి వెబ్‌సైట్‌లో సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

22న జిల్లా స్థాయి మహిళల ఓపెన్ చదరంగం పోటీలు

విశాఖపట్నం స్పోర్ట్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఓపెన్ మహిళల చదరంగం టోర్నీ కమ్ జిల్లా జట్టు ఎంపికలు ఈ నెల 22న కశ్యప్ కళాశాలలో నిర్వహిస్తామని ఆల్ విశాఖ చెస్ సంఘం కార్యదర్శి మణికంఠరావు తెలిపారు. అన్ని కేటగిరీల మహిళలు పాల్గొనవచ్చునన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 21న మధ్యాహ్నం 12 గంటల్లోపు 9849371760, 9848460137 నంబర్లలో సంప్రదించి ఎంట్రీలు పొందాలని స్పష్టం చేశారు.

యోగాసనాలకు మేము సైతం!

యోగా దినోత్సవానికి సన్నద్ధమవుతున్న మానసిక దివ్యాంగులు

కొద్ది రోజులుగా విద్యార్థుల ముమ్మర సాధన

పెదవాల్తేరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వారు బుద్ధిమాంద్యంతో సతమతమవుతున్న విద్యార్థులు. శిక్షకుల ప్రోత్సాహంతో అనేక రంగాల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో ఆసనాలు వేసి తమ సత్తా చాటేందుకు సన్నద్ధమవుతున్నారు. ప్రధాని మోదీ ఎదుట యోగాసనాలను ప్రదర్శించేందుకు వీరికి అవకాశం లభించింది.


యోగాసనాలు వేస్తున్న బుద్ధిమాంద్యం విద్యార్థులు

బుద్ధిమాంద్యం శాపమే కావచ్చు కానీ యోగసనాలకు నేర్చుకుని, వేసేందుకు అడ్డుకాదని నిరూపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా పట్టుదలతో సాధన చేస్తున్నారు. పెదవాల్తేరులోని హిడెన్ స్పాట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు

ఈ పాఠశాల గత 20 ఏళ్లగా నడుస్తోంది. నిర్వాహకుడు కండిపిల్లి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సుమారు 200 మంది మానసిక దివ్యాంగ విద్యార్థులకు విద్యతో పాటు యోగా, కరాటే, కుట్లు, ఇతర కళలు నేర్పిస్తున్నారు. గత 18 ఏళ్లగా ఇక్కడి విద్యార్థులకు యోగా నేర్పిస్తున్నారు. వీరిలో సుమారు 161 మంది నగరంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొననున్నారు. బీచ్ రోడ్డులో పెద్దఎత్తున నిర్వహించనున్న యోగా ఉత్సవాలకు హాజరయ్యే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎదుట ప్రత్యేక ప్రదర్శన ఇచ్చేందుకు వీరికి అవకాశం లభించింది. దీంతో యోగా గురువు వెంకట రమణ వీరికి ఉత్తమంగా తర్ఫీదునిస్తున్నారు. బుద్ధిమాంద్యం విద్యార్థుల్లో శ్యామ్ శిక్షకుడి స్థాయికి చేరాడు. యోగాసనాలకు వేసే విధానాన్ని మైక్‌లో బోధిస్తూ, మిగిలిన వారికి సహాయంగా నిలుస్తున్నాడు.


విద్యార్థులతో ఆసనాలు వేయిస్తున్న శిక్షకుడు వెంకటరమణ

శిక్షణతో సంతృప్తి



మానసిక దివ్యాంగులకు యోగా నేర్పించడంలో ఎంతో తృప్తి ఉంది. యోగాంధ్ర కార్యక్రమంలో ఈ విద్యారులకు అవకాశం లభించడం సంతోషంగా ఉంది. యోగాను మరింత ముందుకు తీసుకు వెళ్లేందుకు నా వంతు ప్రయత్నం చేస్తున్నా. పరిపూర్ణమైన ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ యోగా నేర్చుకోవాలి.

- వెంకటరమణ, యోగా గురువు

యోగాంధ్రకు ముమ్మర ఏర్పాట్లు


ఆర్‌కే బీచ్ ఎన్టీఆర్ విగ్రహానికి విద్యుత్ దీపాలు


యోగా వేడుకలను వీక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్లు


ప్రధాన వేదిక వద్ద గ్రీన్ మ్యాట్లు వేస్తున్న సిబ్బంది


సిరిపురం దత్‌ఐల్యాండ్ వద్ద విద్యుత్ దీపాలంకరణ


ఆర్‌కే బీచ్‌లో ప్రధాన వేదిక వద్ద పోలీసు బందోబస్తు

సింహగిరిపై ఉత్సాహంగా యోగా సాధన


సింహగిరిపై యోగా చేస్తున్న ఎంపీ శ్రీభరత్, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్


యోగాసనాలు వేస్తున్న వేద పాఠశాల విద్యార్థులు

సింహాచలం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై యోగాసాధనతో ఉత్తేజితమయ్యామని ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా సన్నాహ సాధన కార్యక్రమం ఈవో వేంద్ర త్రినాథరావు పర్యవేక్షణలో బుధవారం నిర్వహించారు. సాధకులకు పైడెం నాయుడు, వెంకటరమణ శిక్షణ ఇచ్చారు. దేవాలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పండితులు వేద స్వస్తి వచనాలతో శ్రీకారం చుట్టారు. అనంతరం సుమారు 25 రకాల యోగాసనాలను వేయించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మీడియాతో మాట్లాడుతూ యోగాఆధ్యాత్మిక జాగృతికి సాధనమే కాకుండా మానసిక, శారీరక శక్తిని పెంచే అద్భుత ప్రక్రియ అన్నారు. ప్రధాని మోదీ ఆలోచనలతో ఈనెల 21న ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఆర్‌కే బీచ్‌లో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా పెద్దఎత్తున పాల్గొని విజయంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ దేశ ప్రతిష్ఠ ఇనుమడింపజేసేలా యోగాను ప్రతినిత్యం సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, ఎస్‌వీఎల్‌ఎన్ వాకర్స్ క్లబ్ సభ్యులు, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సాధకులకు స్వామి దర్శనం కల్పించారు.

నిరంతరాయంగా ఫైబర్‌నెట్ సేవలందించేలా చర్యలు

- **22వ తేదీలోగా ఆప్టికల్ గ్రౌండ్‌వైర్ సమస్యలు పరిష్కరించాలి**
- **అధికారులకు ఫైబర్‌నెట్ ఎండీ ప్రవీణ్ ఆదిత్య ఆదేశాలు**

సిరిపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజలకు ఇక అంతరాయం లేని ఫైబర్‌నెట్ సేవలు అందించనున్నట్టు ఫైబర్‌నెట్ ఎండీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. ఆయన బుధవారం విశాఖలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఇకపై ప్రజలకు ఫైబర్‌నెట్ సేవల్లో ఎటువంటి అంతరాయాలు ఉండటానికి వీలు లేదని స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫైబర్‌నెట్ సేవల్లో డౌన్‌టైమ్ అనే మాటకు చోటు లేదన్నారు. ఈ దిశగా అధికారులు లక్ష్యాల మేరకు పని చేయాలన్నారు. ఈ సమావేశంలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఫైబర్‌నెట్ ప్రసారాలు, సేవలకు సంబంధించిన తరచూ జరుగుతున్న అంతరాయాలకు ప్రధాన కారణం పవర్‌బ్యాకప్, ఫైబర్‌కట్స్‌గా గుర్తించాలన్నారు. ఈ సమస్యలను అధిగమించేందుకు ఫైబర్‌నెట్ ముఖ్య సాంకేతికాధికారి సీటీవో వీటిపైన రోజువారీ నివేదికలు అందజేస్తారని తెలిపారు. తద్వారా ఈ సమస్యలు ఎదురవకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాల వారీగా అంతరాయంపై సమీక్షించారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి: మంత్రి నారాయణ

డాబాగార్డెన్స్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రను విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం సూర్యాబాగ్ జోన్-4 జోనల్ కార్యాలయం హాల్‌లో తూర్పు నియోజకవర్గ సమావేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి పాల్గొంటున్న నేపథ్యంలో వార్డుల నుంచి ఎంత మందిని తరలిస్తారు, ఎక్కడ స్థలం కేటాయించారో తెలుసుకున్నారు. సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

యోగాంధ్రను ప్రపంచం వీక్షించనుంది

విశాఖపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రను -ప్రపంచం వీక్షించనుందని, రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. వీఎంఆర్డీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖలోనే యోగా చేసేందుకు ఆరు లక్షలమంది యాప్‌లో నమోదుచేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమం గిన్నీస్‌బుక్‌లోనికి ఎక్కనుండటం చరిత్ర అన్నారు. సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్, మచిలీపట్నంలో బీచ్‌ఫెస్టివల్,నిర్వహించామన్నారు. గత ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలను అటకెక్కించిందన్నారు.

జగన్‌వి శవ రాజకీయాలు

ప్రజాసమస్యల పట్ల జగన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ శవరాజకీయాలే చేస్తారన్నారని విమర్శించారు. ప్రకృతి విపత్తులు సంభవించినా హింసాకాండలు జరిగినా బాధితులను పరామర్శించలేదని కానీ క్రిమినల్స్‌కు, గంజాయి ముఠాలకు మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. వైసీపీ హయాంలో టీడీపీపై దాడులు జరిగాయని జగన్ పర్యటనకు ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు పెట్టలేదన్నారు. జగన్ తన హెలికాప్టర్‌పై తానే రాయివేసుకొని డ్రామాలు చేశారని తీవ్రంగా దుయ్యబట్టారు. పొదిలిలో రైతుల పొగాకు పంటలను కావాలని తొక్కించారని ఆరోపించారు. రైతు సుభిక్షంగా ఉండాలన్నదే తమ ధ్యేమన్నారు. జగన్‌తన పార్టీని లష్కరే తోయిబా వంటి తీవ్రవాద సంస్థగా మారుస్తున్నారన్నారు. జగన్ ర్యాలీలో మృతి చెందిన సింగయ్య కుటుంబాన్ని కనీసం పరామర్శించకపోవడం దళితుల పట్ల ఆయన నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తుందన్నారు.

ఆ ఇంట ఐదుగురికి 'తల్లికి వందనం'

ఖాతాలో రూ.65 వేలు జమ ▸▸ తల్లిదండ్రుల హర్షాతిరేకాలు


పథకం అందుకున్న తల్లి కుమారి, ఐదుగురు పిల్లలు

పెందుర్తి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకలవ్య కాలనీకి చెందిన చిన రాయుడు, కుమారి దంపతులు దినసరి కూలీలు. వీరికి ఐదుగురు పిల్లలు, రాంపురం జెడ్పీ పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న అజయ్, విజయ్ కవలలు కాగా, ఐదో తరగతి చదువుతున్న సతీశ్, అశ్విన్ కూడా కవలలే. కుమార్తె యామిని రెండో తరగతి చదువుతోంది. వీరందరికీ 'తల్లికి వందనం' పథకం వర్తించి కుమారి బ్యాంకు ఖాతాలో రూ.65 వేలు జమయింది. ఈ మేరకు బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు చిన్నారులను అభినందించారు. పథకం వర్తించడంతో తమ పిల్లల చదువుకు ఢోకా లేకుండా పోయిందని ఆనందం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో హెచ్‌ఎం రాము, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

పీసీసీ అధ్యక్షురాలికి నేతల స్వాగతం


వైఎస్ షర్మిలకు స్వాగతం పలుకుతున్న నేతలు

గోపాలపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పర్యటన కోసం నగరానికి వచ్చిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. బుధవారం మధ్యాహ్నం 1.10 గంటలకు హైదరాబాద్ నుంచి విశాఖ చేరుకున్న ఆమెకు కాంగ్రెస్ పార్టీ నేతలు హాసిని వర్మ, సోడదాసి సుధాకర్, జగన్నాథం, శివకుమార్, డి.నూకరాజు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె రోడ్డు మార్గంలో అరకు వెళ్లారు.

ప్రియుడే హంతకుడు

▸▸ వివాహిత హత్య కేసులో వీడిన మిస్టరీ


నిందితుడు బొడ్డు రాజు

భీమునిపట్నం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎర్రమట్టిదిబ్బల్లో హత్యకు గురై, అస్థిపంజరంగా వెలుగుచూసిన వివాహిత కేసు మిస్టరీ వీడింది. పోలీసులు 24 గంటల్లో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.

జీవీఎంసీ భీమిలి జోనల్ కార్యాలయం పారిశుధ్య విభాగంలో క్లాప్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్న బొడ్డు రాజు గాడు వీధిలో నివాసం ఉంటున్నాడు. అతడికి ఏడాది క్రితం వివాహిత బంగారు కవిత (28)తో పరిచయమైంది. ఇద్దరూ వివాహేతర సంబంధం కొనసాగించారు. రాజుకు గతంలోనే వివాహం జరిగింది. కొంతకాలం తర్వాత దంపతులు విడిపోయారు. కవితకు భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు. రాజు ఒకవైపు కవితతో సంబంధం కొనసాగిస్తూనే మరోవైపు పెళ్లి సంబంధాలకు వెళ్తుండేవాడు. తోటవీధికి చెందిన పుష్పతో ఈఏడాది ఏప్రిల్ నెలాఖరులో వివాహం జరిగింది. అప్పటి నుంచి రాజు, కవిత మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 9వ తేదీన రాజు వారు తరచూ కలుసుకునే ఎర్రమట్టిదిబ్బల్లోని షెడ్ వద్దకు కవితను తీసుకువెళ్లాడు. అక్కడ మరోసారి ఇద్దరూ గొడవ పడ్డారు. తనను పెళ్లి చేసుకోవాలని, లేదా ఎక్కడికైనా తీసుకువెళ్లిపోవాలని కవిత నిలదీయడంతో చున్నీని ఆమె పీకకు బిగించి, హత్య చేశాడు. ఆత్మహత్యగా చిత్రీకరించడానికి అక్కడే వున్న చెట్టు కొమ్మకు చున్నీతో మృతదేహాన్ని వేలాడదీసి వెళ్లిపోయాడు. మృతురాలి తల్లి మే 12న తన కుమార్తె కనిపించడం లేదని భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యకు గురైన ప్రదేశం నిర్మానుష్యంగా ఉండడంతో నెల రోజుల వరకూ ఈ సంఘటన వెలుగులోకి రాలేదు. ఇదిలా ఉండగా పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే తన కుమార్తె హత్య జరిగిందని మృతురాలి తల్లి, బంధువులు ఆరోపిస్తున్నారు.

వీధి కుక్కదాడిలో 8 మంది చిన్నారులకు గాయాలు



గాయపడిన అయ్యాన్, కావ్య

ఆటోనగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డులో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఎనిమిది మంది చిన్నారులపై ఓ కుక్క దాడి చేసి గాయపరిచింది. టీవీఎస్ కాలనీకి చెందిన అయ్యాన్ (6)కు ఎడమ కంటి వద్ద, శ్రీనివాస నగర్‌కు కావ్యకు (2) ఎడమ చేతి భుజంపై గాయాలయ్యాయి. అలాగే మరో ఆరుగురు చిన్నారులను కుక్క కరవడంతో వారిని తల్లిదండ్రులు తక్షణమే ఆస్పత్రికి తరలించారు. వార్డులో కుక్కల బెడద అధికమైందని జీవీఎంసీ, సచివాలయ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుత్తమ్మ తల్లికి బాదం పప్పుతో అలంకరణ



భీమునిపట్నం (రూరల్), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పాడ గ్రామంలో సుత్తమ్మ తల్లి అమ్మవారిని బాదం పలుకులతో అలంక రించి, పూజలు చేశారు. అమ్మవారిని ప్రతి బుధవారం ఏదో ఒక అలంకరణ చేసి పూజలు చేయడం ఆనవాయితీ. ఈ వారం సుమారు ఎనిమిది కిలోల బాదం పలుకులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అమ్మవారిని సుమారు 12 గ్రామాల ప్రజలు ఆరాధ్య దేవతగా పూజిస్తారు. బాదం పప్పుల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.